1

నవతెలంగాణ
నమ్మకమైన తెలుగు దినపత్రిక

కుమురంభీం ఆసిఫాబాద్

శనివారం | డిసెంబర్ 23, 2023 | www.navatelangana.com

ఐఎన్టీయూసీలో 100 మంది చేరిక

నవతెలంగాణ - కాసిపేట

మందమర్రి ఏరియాలోని కాసిపేట గనిపై శుక్రవారం 100 మంది కార్మికులు ఐఎన్టీయూసీలో చేరారు. ఏఐటీయూసీ, టీబీజీకేఎస్ యూనియన్ల నుంచి ఐఎన్టీయూసీలో చేరగా వారికి నాయకులు కండువాలు కప్పి ఐఎన్టీయూసీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఐఎన్టీయూసీ సెంట్రల్ కార్యదర్శి రాపర్తి శ్రీనివాస్, మాజీ జడ్పీటీసీ రౌత్ సత్తయ్య, ఐఎన్టీయూసీ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.



జాతీయ స్థాయి నెట్‌బాల్ పోటీలకు ఎంపిక

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలోని ఆదర్శ పాఠశాల, కళాశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు జాతీయ స్థాయి నెట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ అబ్దుల్ ఖలీల్ తెలిపారు. మేడ్చల్‌లో తెలంగాణ నెట్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో పదవ తరగతి విద్యార్థిని డి.శాలిని, తొమ్మిదో తరగతి విద్యార్థిని పి.అర్చన ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. ఎంపికైన విద్యార్థులు ఈనెల 24 నుండి 26వ తేదీ వరకు జార్ఖండ్ రాష్ట్రంలో జరగనున్న నెట్ బాల్ ఛాంపియన్షిప్ పోటీల్లో పాల్గొంటారన్నారు. ఈ సందర్భంగా జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను ప్రిన్సిపాల్, పీడీ బి.తిరుపతి, ఉపాధ్యాయులు, యాజమాన్య కమిటీ చైర్మన్ ప్రేమ్‌కుమార్ అభినందించారు.



ఘనంగా వెంకటస్వామి వర్ధంతి



నవతెలంగాణ-రామకృష్ణాపూర్

పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పట్టణ కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో శుక్రవారం మాజీ కేంద్ర మంత్రి వెంకటస్వామి 9వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం స్థానిక సింగరేణి ఏరియా ఆస్పత్రిలో గర్భిణులకు, రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు పల్లె రాజు, టీపీసీసీ కార్యదర్శి పిన్నింటి రఘునాథ్‌రెడ్డి, మండల బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు గోపతి రాజయ్య, సంగ బుచ్చయ్య, యాకూబ్ అలీ, మహంకాళి శ్రీనివాస్, ఒడ్నాల శ్రీనివాస్, పలిగిరి కనకరాజు, కొట్టే రాజయ్య, అక్కల లచ్చయ్య, తిప్పని రామన్న, పూల్లూరి కళ్యాణ్, గోపతి బానేష్, ఉప్పల సురేష్, పందేన కృష్ణ, సంగ రవి, మారపల్లి రాజయ్య నక్క శ్రీనివాస్, రేషవేణి మల్లేష్, గూడ సత్తయ్య, పట్టణ యువజన అధ్యక్షులు రామకృష్ణ, మహిళ నాయకురాలు కల్పన పాల్గొన్నారు.

ఎఫ్ఎస్ఓ బాలకృష్ణ వైఖరి మార్చుకోవాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

చెన్నూరు మండలం ఆస్నాద్‌లో ఫారెస్ట్ సెక్షన్ అధికారిగా విధులు నిర్వర్తిస్తున్న బాలకృష్ణ తన వైఖరి మార్చుకోవాలని సిర్పూర్, చెన్నూరు ఏరియా మావోయిస్టు కార్యదర్శి మంగు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆస్నాద్ గ్రామానికి చెందిన ఎరుకల ఎల్లవ్వ, ఆమె కొడుకు లక్ష్మణ్‌పై చేయి చేసుకున్నాడని, వారి వద్ద నుండి డబ్బులు వసూలు చేశారని తెలిపారు. ఆయనపై ఉన్నతాధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. వెంటనే ఆయన వైఖరి మార్చుకొని డబ్బులు తిరిగి వారికి ఇవ్వాలని పేర్కొన్నారు.

మరమ్మత్తు పనులు ప్రారంభం

నవతెలంగాణ - వాంకిడి

మండల కేంద్రంలో నిర్మిస్తున్న నాలుగు వరుసల రహదారిలో భాగంగా అప్రోచ్ రోడ్డు గుంతలు తవ్వి వదిలేయడంతో వాహనదారులు రాకపోకలు కొనసాగించడానికి ఇబ్బందులు కలగడంతో డీబీఎల్ అధికారులు స్పందించి శుక్రవారం మరమ్మత్తు పనులను ప్రారంభించారు. వారం రోజుల క్రితం రోడ్డుపై గుంతలు తవ్వి వదిలేయడంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కోవడంతో మరమ్మత్తు పనులు చేపట్టారు. దీంతో వాహనదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నేడు క్రిస్మస్ వేడుకలు

నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్ పట్టణంలోని యూసీసీ చర్చ్‌లో శనివారం ఉదయం 11 గంటలకు క్రిస్మస్ వేడుకలు నిర్వహించనున్నట్లు సిర్పూరు తాలూకా పాస్టర్స్ అసోసియేషన్ ఫెలోషిప్ అధ్యక్షులు ఎండి విల్‌ఫ్రెడ్, ప్రధాన కార్యదర్శి కెబీ మోజెస్ తెలిపారు. శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడుతూ క్రిస్మస్ వేడుకలలో భాగంగా ప్రేమ విందు, బట్టల పంపిణీ కార్యక్రమాలు నిర్వహించనున్నామని, ప్రజలు పాల్గొనాలని కోరారు. దీనికి ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు హాజరు కానున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి సుకుమార్, గౌరవాధ్యక్షులు తిమోతి జయరాజ్, ఉపాధ్యక్షులు యేసు కుమార్ పాల్గొన్నారు.

పాఠశాలల పని వేళలు మార్చాలి

నవతెలంగాణ-కాగజ్‌నగర్

జిల్లాలో రోజురోజుకూ చలి తీవ్రత పెరుగుతున్నందున పాఠశాలల పని వేళలు మార్చాలని పీఆర్‌టీయూ టీఎస్ జిల్లా అధ్యక్షులు ఏటుకూరి శ్రీనివాస్‌రావు ఒక ప్రకటనలో కోరారు. ఉదయం ఉష్ణోగ్రతలు పది డిగ్రీల సెంటిగ్రేడ్‌కు పడిపోతుండడంతో విద్యార్థులు పాఠశాలలకు రావడానికి ఇబ్బందులు పడుతున్నారని, దీంతో విద్యార్థుల గైర్హాజరు పెరుగుతోందని పేర్కొన్నారు. ఉదయం 10-30 నుండి సాయంత్రం 4 గంటల వరకు పాఠశాలలు కొనసాగే విధంగా జిల్లా కలెక్టర్ చర్యలు తీసుకోవాలని కోరారు.

అయ్యప్ప స్వాముల చక్రస్నానం

నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్‌లో శుక్రవారం అయ్యప్ప స్వాముల చక్రస్నానం కార్యక్రమం నిర్వహించారు. ముందుగా పట్టణంలోని అయ్యప్ప ఆలయం నుండి స్వామి ఉత్సవ విగ్రహంతో ఊరేగింపు నిర్వహించారు. శరణుగోష పాటలతో ఊరేగింపు నిర్వహించి సమీపంలోని పెద్దవాగులో అయ్యప్ప భక్తులు చక్రస్నానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు గణేష్ నాయర్, గురుస్వాములు భిక్షపతి, నాగేందర్, శంకరయ్య, రవీందర్‌తో పాటు పలువురు స్వాములు పాల్గొన్నారు.

జంతు శాస్త్ర అధ్యాపక పోస్టుకు దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాలలో జంతు శాస్త్రం(జువాలజీ) బోధించడానికి ఆసక్తి గల అభ్యర్థుల నుండి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ అబ్దుల్ ఖలీల్ పేర్కొన్నారు. 9వ తరగతి నుండి ఇంటర్మీడియట్ వరకు ఆంగ్ల మాధ్యమంలో జంతు శాస్త్రం బోధించుటకు ఆసక్తి గలవారు ఈ నెల 27 సాయంత్రం 4గంటలలోపు ధ్రువపత్రాల జిరాక్స్ ప్రతులతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. జువాలజీలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేసి ఉండాలని, ఇంటర్మీడియట్‌కి బోధన అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. వేతనం గరిష్టంగా నెలకు రూ.18200 ఉంటుందని తెలిపారు.

ఘనంగా జాతీయ గణిత దినోత్సవం

నవతెలంగాణ - కాగజ్‌నగర్ రూరల్

మండలంలోని రాస్పెల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ జయంతిని పురస్కరించుకుని జాతీయ గణిత దినోత్సవం నిర్వహించారు. రామానుజన్ చిత్రపటానికి పూలమాలతో నివాళు లర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులు గణితమేళాను నిర్వహించారు. టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్ ప్రదర్శించారు. ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు ఏటుకూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ గణిత శాస్త్రం జీవితంలో అతి ముఖ్యమైన విషయమని, అన్ని శాస్త్రాలకు అనుసంధానం చేసేది గణిత శాస్త్రమని తెలిపారు. ఈ గణిత శాస్త్ర పరిశోధనలు కృషి చేసిన శ్రీనివాస రామానుజన్ గొప్ప మేధావని, సంఖ్యా సిద్ధాంతం , గణిత విశ్లేషణ, అనంత శ్రేణులు తదితర అంశాలపై పరిశోధన పత్రాలను అనేక దేశ విదేశాలలో ప్రచురించబడ్డాయన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఇందారపు ప్రకాష్, మహిపాల్, దివ్యశ్రీ, గాయత్రి విద్యార్థులు పాల్గొన్నారు.



బెజ్జూర్ : మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిబపూలే పాఠశాలలో శుక్రవారం గణితశాస్త్ర పితామహుడు శ్రీనివాస రామానుజన్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ వసంత్ మాట్లాడుతూ శ్రీనివాస్ రామానుజన్ గణితశాస్త్ర పితామహుడని, గణితశాస్త్రం గురించి ఆయన చేసిన సేవలను విద్యార్థులకు వివరించారు. అనంతరం విద్యార్థులు గణితశాస్త్ర వైజ్ఞానిక ప్రదర్శన, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో సోమిని సర్పంచ్ ఏలాది శారద, పాఠశాల చైర్మన్ సురేష్, వైస్ చైర్మన్ తాజుద్దీన్, పాఠశాల కరస్పాండెంట్ ప్రకాష్, డైరెక్టర్ తిరుపతి, నాయకులు జావిద్ అలీ, అమిరుద్దీన్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



బెజ్జూర్‌లో..

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



నవతెలంగాణ-కెరమెరి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డిబిఎం నాబార్డ్‌కు చెందిన ప్రోబరీ అధికారి రమిత్ మౌర్య అన్నారు. వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని మెట్ట పిప్పిరి గ్రామంలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై గిరిజనులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2014 నుంచి కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన పథకాల వివరాలను ప్రజలకు తెలియజేశారు. సంక్షేమ పథకాల పూర్తి వివరాలను ఎప్పటికప్పుడు తెలుసుకోవాలన్నారు. రైతుల కోసం అమలు చేసిన సంక్షేమ పథకాలు, బ్యాంకు సేవలు, ఇన్సూరెన్స్ తదితర అంశాలపై వివరించారు. ఆరోగ్యానికి సంబంధించిన పథకాల ద్వారా ఉపయోగాలను తెలిపారు. అంతకుముందు గ్రామస్తులు సంబంధిత అధికారులకు ఘనస్వాగతం పలికారు. అనంతరం సర్పంచ్ ఆధ్వర్యంలో శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎల్డిఎం హనుమంతరావు, ఏపీడీ శ్రీనివాస్, ఐకెపి ఎపిఎం జగదీశ్వర్, గ్రామస్తులు మడావి రఘునాథ్ పాల్గొన్నారు.

12న చలో పార్లమెంట్‌ను విజయవంతం చేయాలి

- ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మిట్టపల్లి తిరుపతి

నవతెలంగాణ-నస్పూర్

అందరికీ ఉచిత విద్య, ఉపాధి కల్పనకు జనవరి 12న చలో పార్లమెంట్‌ను విజయవంతం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మిట్టపల్లి తిరుపతి అన్నారు. శుక్రవారం మంచిర్యాలలోని వివేకానంద పాలిటెక్నిక్ కళాశాలలో చలో ఢిల్లీ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తిరుపతి మాట్లాడుతూ ఎస్ఎఫ్ఐతో పాటు 16 విద్యార్థి సంఘాలతో కలిసి చలో పార్లమెంట్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తోందన్నారు. కేంద్ర బడ్జెట్లో విద్యారంగానికి 3శాతం నిధులు మాత్రమే కేటాయిస్తున్నారని, ఈ బడ్జెట్ సమావేశాల్లో విద్యారంగానికి కనీసం 20 శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం నిర్వహించే ప్రభుత్వ విద్యా సంస్థలకు సరిపడా నిధులు కేటాయించాలని కోరారు. దేశంలో ఎన్నడూ లేనంతగా నిరుద్యోగం పెరిగిందని, సంవత్సరానికి 10లక్షల ఉద్యోగాలు కల్పిస్తానన్న కేంద్ర ప్రభుత్వ హామీ ఏమైందని ప్రశ్నించారు. కేంద్ర విశ్వవిద్యాలయాల్లో నిరసనలు వ్యక్తం చేస్తున్న విద్యార్థులపై అక్రమంగా కేసులు బనాయిస్తున్నారని, జరిమానాలు విధిస్తున్నారని, ప్రశ్నించే గొంతుకులను నిర్బంధించే చర్యలు ప్రజాస్వామ్యంలో ఉండరాదని పేర్కొన్నారు. దేశంలో అత్యంత ప్రతిష్టాత్మక జవహర్ లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయంలో నిరసన తెలిపితే రూ.20వేలు జరిమానా విధిస్తామని వైస్ ఛాన్స్‌లర్ సర్క్యులర్ జారీ చేయడం అప్రజాస్వామికమన్నారు. నూతన జాతీయ విద్యా విధానం అమలులో భాగంగా ఎన్‌టిఏ ద్వారా అన్ని రకాల జాతీయస్థాయి పోటీ పరీక్షలను కేంద్రమే నిర్వహించాలని చూస్తుందన్నారు. జాతీయస్థాయి పోటీ పరీక్షలన్నీ ఎన్‌టిఏ నిర్వహించడం ద్వారా అధికారం కేంద్రీకృతమై తమిళనాడులో జాతీయస్థాయి మెడికల్ ఎంట్రన్స్ టెస్ట్‌లో అవకతవకలు జరిగిన మాదిరిగా ఇతర పోటీ పరీక్షల్లో జరిగే అవకాశం ఉందన్నారు. ఎన్‌టిఏ అనే ఒకే గొడుగు కింద జాతీయస్థాయి పోటీ పరీక్షలు అన్నీ నిర్వహించడం సరైన నిర్ణయం కాదన్నారు. ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ బిసి విద్యార్థులకు ఇచ్చే జాతీయస్థాయి ఫెలోషిప్‌లో కోత విధిస్తున్నారని, ఈ కారణం చేతనే జాతీయ విశ్వవిద్యాలయాల్లో విద్యార్థుల ఆత్మహత్యలు పెరిగాయన్నారు. అందరికీ ఉచిత విద్య, అందరికీ ఉపాధి కల్పించాలని చేపట్టబోయే చలో పార్లమెంట్ కార్యక్రమానికి ప్రజాస్వామికవాదులు మద్దతు ప్రకటించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యుడు ఈదునూరి అభినవ్, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.



గుర్తింపు ఎన్నికలపై హైకోర్టు తీర్పు హర్షణీయం



నవతెలంగాణ-నస్పూర్

గుర్తింపు ఎన్నికలపై హైకోర్టు ఇచ్చిన తీర్పు హర్షణీయమని, దాన్ని స్వాగతిస్తున్నామని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) రాష్ట్ర అధ్యక్షుడు వాకిరెడ్డి సీతారామయ్య తెలిపారు. శుక్రవారం నస్పూర్-శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సింగరేణిలో గుర్తింపు ఎన్నికలు డిసెంబర్ 27న జరగాల్సి ఉండగా రాష్ట్ర ప్రభుత్వం, యాజమాన్యం ఎన్నికలు నిలిపివేయాలని వేసిన పిటిషన్‌పై విచారణ జరిగిందన్నారు. న్యాయస్థానం రాష్ట్ర ప్రభుత్వానికి, యాజమాన్యానికి 27 తారీఖునే ఎన్నికలు నిర్వహించాలని ఆదేశించిందని పేర్కొన్నారు. ఎన్నికల నిర్వహణ వాయిదా వేయాలని కొన్ని యూనియన్‌లు సైతం సంతకాలు పెట్టాయన్నారు. కార్మికుల పక్షాన పోరాటాలు నిర్వహించి కష్టసుఖాల్లో పాలుపంచుకునే ఏఐటీయూసీని గెలిపించాలని కోరారు. గుర్తింపు సంఘంగా ఏఐటీయూసీని గెలిపిస్తే పెర్క్స్‌పై ఇన్కమ్ టాక్స్‌ను కోల్ ఇండియా కార్మికులకు చెల్లించే విధంగా సింగరేణిలో కూడా యాజమాన్యం ద్వారా చెల్లింపజేస్తామన్నారు. ప్రతి కార్మికుడికి 250 గజాల ఇంటి స్థలంతో పాటు రూ.20లక్షల వడ్డీ లేని రుణాన్ని ఇప్పిస్తామన్నారు. సింగరేణిలో పెరిగిపోయిన కాంట్రాక్టీకరణను అడ్డుకుంటామని, నూతన అండర్ గ్రౌండ్ గనులను తీసుకొచ్చి యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని అన్నారు. ఈ ఎన్నికల్లో చుక్క గుర్తుకు ఓటేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కార్మికులను కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు వీరభద్రయ్య, ముస్కే సమ్మయ్య, బాజీ సైదా, కొట్టే కిషన్‌రావు, మోతుకూరి కొమురయ్య, సారయ్య, అఫ్రోజ్‌ఖాన్ పాల్గొన్నారు.

వంద శాతం ఉత్తీర్ణతకు చర్యలు చేపట్టాలి

- ఆదిలాబాద్ కలెక్టర్ రాహుల్ రాజ్
- విద్యాశాఖాధికారులతో సమీక్షా సమావేశం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పదో తరగతిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం డైట్ కళాశాలలో పదో తరగతి విద్యార్థుల పరీక్షలు, ఇతర అంశాలపై విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పదవ తరగతిలో వందశాతం ఉత్తీర్ణత సాధించేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించుకొని, విద్యార్థులను పరీక్షలకు సిద్ధం చేయాలని సూచించారు. నిర్ణీత గడువులోగా సబ్జెక్టుల వారీగా సిలబస్‌ను పూర్తిచేసి, చదువులో వెనకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులను నిర్వహించాలని అన్నారు. పాఠశాలల్లో విద్యార్థుల హాజరుశాతం పెంచేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పదవతరగతి పూర్తైన ప్రతి విద్యార్థి కళాశాలల్లో ప్రవేశాలు పొందేలా సంబంధిత పాఠశాలల ఉపాధ్యాయులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని సూచించారు. జిల్లాలో రీడ్ టూ రూమ్ కార్యక్రమం ద్వారా విద్యార్థులు పఠన నైపుణ్యం పెంచేలా ప్రోత్సాహం అందించడం జరుగుతుందని, ప్రాథమిక స్థాయి విద్యార్థులకు చదవం, రాయడం వంటి నైపుణ్యాలు అభివృద్ధి చెందేలా శిక్షణ అందించడం జరుగుతుందని వివరించారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం నిర్వహణలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని, విద్యార్థులు క్యూలైన్ పాటించేలా చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారిణి టి.ప్రణీత, మండల విద్యాధికారి జయశీల, సెక్టోరల్ అధికారి నారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రతిపక్ష ఎంపీల గొంతు నొక్కడం అప్రజాస్వామికం

నవతెలంగాణ-లక్షెట్టిపేట

పార్లమెంట్‌లో ప్రతిపక్ష పార్టీ ఎంపీల గొంతు నొక్కడం అప్రజాస్వామికమని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. శుక్రవారం అకారణంగా పార్లమెంట్ నుంచి ఎంపీలను సస్పెన్షన్ చేయడాన్ని నిరసిస్తూ ఇండియా కూటమి నిరసనలో భాగంగా ఉత్కూర్ అంబేద్కర్ చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు ఆరిఫ్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశ చరిత్రలో ఇంత మంది ఎంపీలను సస్పెన్షన్‌కు గురి చేయడం ఇదే మొదటిదని తెలిపారు. పార్లమెంట్‌పై దాడి గురించి ప్రశ్నించినందుకు సస్పెండ్ చేయడానికి తీవ్రంగా ఖండించారు. మోడీ రాక్షస పాలన సాగిస్తున్నారని విమర్శించారు. కార్యక్రమాలో కాంగ్రెస్ నాయకులు చింత అశోక్, అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.



సింగరేణి సివిల్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ ఎన్నిక



నవతెలంగాణ-మందమర్రి

సింగరేణి సివిల్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా బర్ల నాగ మల్లేష్, ఉపాధ్యక్షులుగా గుంటి రవీందర్, ప్రధాన కార్యదర్శిగా బర్ల చంద్రశేఖర్, కోశాధికారిగా సిహెచ్ శ్రీనివాస్ ఎన్నికయ్యారు. స్టీరింగ్ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన ఎన్నికలకు అన్నీ పదవులకు సింగిల్ నామినేషన్లు వచ్చినందున నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు స్టీరింగ్ కమిటీ ప్రకటించింది. నూతనంగా ఎన్నికైన సభ్యులకు తోటి కాంట్రాక్టర్స్ అభినందనలు తెలిపారు. ఎన్నికైన సభ్యులు మాట్లాడుతూ తమపై నమ్మకంతో ఏకగ్రీవంగా గెలిపించినందుకు సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. 11డివిజన్ అధ్యక్షుడు కనుకుల మొండయ్య, ఆర్. జీవన్, టి.రాజలింగు, ప్రధాన కార్యదర్శి ఎ.రామ్‌రెడ్డి, కోశాధికారి ఎ.రాజమౌళి, ఉపాధ్యక్షుడు కురుమ శ్రీనివాస్, శ్రీరాంపూర్ గౌరవ అధ్యక్షుడు బొడ్డయ్య, బెల్లంపల్లి అధ్యక్షుడు గోపికృష్ణ, ఆర్‌జీ-3 నుండి శంకర్, సమ్మయ్య ఎన్నికయ్యారు. కార్యక్రమంలో స్టీరింగ్ కమిటీ సభ్యులుగా రాజమల్లు, పోతుల పరంధం కుమార్, గోమాస వెంకటేష్, బర్ల రాజకుమార్, మెరుగు దత్తాత్రి పాల్గొన్నారు.

కన్నుల పండువగా సంతాన గణపతి విగ్రహాప్రతిష్ఠాపన

నవతెలంగాణ-కడెం



మండలంలోని అంబారిపేట్ గ్రామంలో శుక్రవారం సంతాన గణపతి విగ్రహా ప్రతిష్టాపన ఉత్సవాలు కనుల పండుగ నిర్వహించారు. ముందుగా పుణ్యాహవాచనం, ప్రాణ ప్రతిష్ఠ, పుణ్యావాసనం, పూర్ణహుతి, విగ్రహా ప్రతిష్టాపన ఉత్సవాలు తీర్థ ప్రసాద వితరణ తదితర పూజ కార్యక్రమాలను అర్చకుల వేదమంత్రాలు మధ్య జరిగాయి. అనంతరం భక్తులకు అన్నదానం కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ కట్ల సింధుజ సాగర్, కుదురుపాక వెంకటేష్, శంకరవ్వ, కుదురుపాక కార్తీక్, హర్షిత, భక్తులు పాల్గొన్నారు.

సఖీ సేవలు సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



సఖి కేంద్రం ద్వారా కల్పిస్తున్న సేవలను మహిళలు, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కేంద్రం అడ్మినిస్ట్రేటర్ సరస్వతి, సోషల్ కౌన్సిలర్ లావణ్య అన్నారు. శుక్రవారం పట్టణంలోని యూత్ ట్రైనింగ్ సెంటర్‌లో విద్యార్థులు, మహిళా చట్టాలపై అవగాహన కల్పించారు. సఖి కేంద్రానికి వచ్చిన బాధితుల వివరాలను గోప్యంగా ఉంచుతామని వారు పేర్కొన్నారు. అత్యవసర సమయంలో 181, 100, 1098, 1930 నంబర్లకు సంప్రదించాలన్నారు.

ఉధృతమవుతున్న ఇథనాల్ ఉద్యమం

- ప్రజల ప్రశ్నలకు కంపెనీ ప్రతినిధుల ఉక్కిరిబిక్కిరి
- బిత్తరపోయిన కంపెనీ సీఈఓ
- అర్థంపర్థం లేని సమాధానాలు చెప్పడంతో ప్రతిఘటించిన గ్రామస్తులు
- న్యూలోలంలో రాస్తారోకో



రైతులు, యువకులతో మాట్లాడుతున్న కంపెనీ సీఈఓ మనోజ్ రుపాని

నవతెలంగాణ-దిలావర్‌పూర్

ఇథనాల్ ఫ్యాక్టరీ పనులు నిలిపేదాక అలుపెరుగని పోరాటం చేస్తూ రోజురోజుకు రైతులు ఉద్యమాన్ని ఉధృతం చేస్తున్నారు. మండలంలోని గుండంపల్లి గ్రామ పరిసరాల్లో ఏర్పాటు చేస్తున్న ఇథనాల్ పరిశ్రమపై రోజురోజుకు నిరసన జ్వాలలు రేగుతున్నాయి. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం రాత్రి సీఐ శ్రీనివాస్ సమీక్షంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఇథనాల్ కంపెనీ సీఈఓ మనోజ్ రుపాని కంపెనీ విధివిధానాలు తెలియజేశారు. కంపెనీ ఆర్టీఐ ద్వార తీసుకున్న సమాచారం మేరకు వారు అనుమతి పత్రాలకు, చేపడుతున్న పనులకు ఎలాంటి పొంతన లేదని, కంపనీ రైతులను తప్పుదోవ పట్టించే విధంగా వ్యవహరిస్తుందని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫ్యాక్టరీ పూర్తి కాలుష్య రహితంగా ఉంటుందని, వన్య ప్రాణులు సంచరించని ప్రదేశమని, పంట పండించేందుకు పనికిరాని భూమని, గోదావరి నదికి ఆరు కిలోమీటర్ల దూరంలో ఉందని పత్రాల్లో పూర్తి తప్పుడు సమాచారం ఉందని యువకులు లేవనెత్తిన ప్రశ్నలకు కంపెనీ సీఈఓ సమాధానం ఇవ్వలేక ఉక్కిరిబిక్కిరయ్యారు.

చిత్తనూర్ ఫ్యాక్టరీ దుష్ప్రభావాల వివరణ

మహబూబ్ నగర్ జిల్లా చిత్తనూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన ఇథనాల్ ఫ్యాక్టరీని సందర్శించి, అక్కడి ప్రజలతో సమాచారం తీసుకోగా పలు విషయాలు తెలిసాయని రైతులు అన్నారు. చుట్టు పక్కల వన్యప్రాణులు, ఫ్యాక్టరీ పక్కనున్న చేపల చెరువులో ఎనిమిది వేల చేపలు చనిపోయాయని, బాలునికి ఫ్యాక్టరీ నుండి విడుదలయ్యే నీటి ద్వార అనారోగ్య సమస్యలు, గర్భిణీలు ఎదుర్కొంటున్న అనారోగ్య సమస్యల గురించి ఫోటోలతో సహా సీఈఓకు చూపించారు. దీంతో సీఈఓ పొంతన లేని సమాధానాలు చెప్పడంతో గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక ఉపేక్షించేది లేదని ఫ్యాక్టరీని ఇక్కడి నుండి అనువైన ప్రదేశానికి తీసుకెళ్లాలని హెచ్చరించారు.

న్యూ లోలంలో రాస్తారోకో... వాహనాల నిలిపివేత

మండల కేంద్రంతో పాటు న్యూలోలం గ్రామానికి చెందిన నాయకులు, రైతులు, యువకులు శుక్రవారం జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. రోడ్డుపై బైఠాయించి వాహనాలు ఎక్కడికక్కడ నిలిపివేశారు. రాస్తారోకోతో నిర్మల్-భైంసా వైపు రహదారిపై కిలోమీటర్ మేర వాహనాలు నిలిచిపోయాయి. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు నాయకులను రైతులతో మాట్లాడడంతో రాస్తారోకో విరమించారు. ఎన్ని నిరసనలు చేపట్టినా ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు ఉంటుందని, ప్రభుత్వం జోక్యం చేసుకొని ఫ్యాక్టరీ పనులు పూర్తిగా నిలిపేవరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని రైతులు, నాయకులు స్పష్టం చేశారు.



న్యూలోలంలో రాస్తారోకో నిర్వహిస్తున్న గ్రామస్తులు, యువకులు

సమస్యల వలయంలో శివునితండా గ్రామపంచాయతీ

- తాగు నీరు సౌకర్యం, మురికి కాలువలు లేక ఇబ్బందులు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

పల్లెల్లో కనీస సౌకర్యాలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం నుంచి నిధులు వస్తున్న వాటిని సక్రమంగా ఖర్చు చేయని కారణంగా అభివృద్ధికి ఆటంకం కలిగి ఎక్కడి సమస్యలు అక్కడే రాజ్యమేలుతున్నాయి. పారిశుధ్య సమస్యలతో సతమతమవుతున్న పట్టించుకునేవారు లేరు. మారుమూల గ్రామాలకు రోడ్డు సౌకర్యం, అంతర్గత రోడ్లు, తాగు నీరు, మురికి కాలువలు లేక జనాలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు కూడా ఇటువైపు చూడడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి.



పాఠశాల సమీపంలో ఉన్న బోరు మోటర్ వద్ద నీటిని తీసుకెళ్తున్న మహిళ

నవతెలంగాణ-కుభీర్

కుభీర్ మండలంలోని శివుని తండా గ్రామపంచాయతీలో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. గ్రామంలో 102 కుటుంబాల్లో 671 మంది ప్రజలు ఉన్నారు. తెలంగాణ ఏర్పాడిన తరువాత 500 జనాభా ఉన్న గిరిజన తండాలను గ్రామపంచాయతీలుగా ప్రకటించింది. దానికి అనుగుణంగానే నిధులను సైతం విడుదల చేస్తుంది. ఈ నిధులతో మౌళిక సౌకర్యాలు, తాగు నీరు, రోడ్లను నిర్మించాలి. కానీ ఆ నిధులను సక్రమంగా ఖర్చుచేయడం లేదు. నిత్యం మురికి కాలువల శుభ్రం, చెత్త సేకరణకు మల్టిపర్పస్ వర్కర్స్‌లను నియామించారు. వారిని నెల వేతనాలు ఇవ్వడంతో పాటు ట్రాక్టర్ల కిస్తులకు నిధులను వినియోగిస్తున్నామని అధికారులు చెబుతున్నారు. ప్రభుత్వ పాఠశాలలో ఒకే చోట బోరు మోటార్ ఉండడంతో ప్రజలు ఏండ్ల బండి ,సైకిల్ మీద తాగునీరును తీసుకువస్తున్నారు. మురికి కాలువలు శుభ్రం చేయని కారణంగా రోడ్లపై మురికి నీరు వచ్చి దుర్గంధం వెదజల్లుతుంది. అధికారులు ప్రజ సౌకర్యాలపై ఆరా తీసిన దాఖలు లేవని గ్రామస్తులు అంటున్నారు. ఇప్పటికైన అధికారులు గ్రామాల్లో పర్యటించి కనీస అవసరాలను తీర్చాలని కోరుతున్నారు.



పారిశుధ్య నిర్వహణ లేక కంపుకొడుతున్న మురికి కాలువ

సమయపాలన పాటించని పంచాయతీ కార్యదర్శి

గ్రామాల అభివృద్ధికి ప్రతి జీపీకి పంచాయతీ కార్యదర్శిని నియమించింది. వీరికి ఉదయం 8 నుంచి విధులు హాజరు కావాలని ఆదేశాలు ఇచ్చింది. అయితే శుక్రవారం మండలంలోని శివుని తండాలో 8గంటలకు హాజరు కావాల్సిన పంచాయతీ కార్యదర్శి 10 దాటిన ఇంకా రాలేదు. కార్యదర్శి ఎప్పుడు వస్తారో ఎప్పుడు వెళ్తారో తెలియడం లేదని చెబుతున్నారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శిని వివరణ కోరగా ఉదయం 8 గంటలకు వచ్చి మళ్ళీ వేరే పని ఉండడం వల్ల చాత గ్రామానికి వెళ్లి వచ్చానని సమాధానం ఇచ్చారు.

మిషన్ భగీరథ ద్వారా చుక్క నీరు రావడం లేదు

ఇందల్, శివునితండా



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కోట్లు ఖర్చు పెట్టి ప్రతి గ్రామానికి మిషన్ భగీరథ ద్వారా తాగు నీరు చుక్క నీరు రావడం లేదు. ఏండ్ల బండి ద్వార నీళ్ల తీసుకెళ్తున్నాం. వ్యవసాయ పనులపై ఆధారపడ్డ తమకు నీరు లేకపోవడంతో వ్యవసాయానికి వెళ్లలేకపోతున్నాం. అధికారులు గ్రామానికి వచ్చి సమస్యలు తెలుసుకోవాలి.

నీళ్ల సమస్యతో ఇబ్బందిగా ఉంది..

కల్పన, శివుని తండా



గ్రామంలో నీటి సమస్య ఉంది. బోరు మోటార్లు వేసినప్పటికి చుక్క నీరు కూడా పడడం లేదు. ప్రభుత్వ పాఠశాల ముందున్న మోటార్ ద్వారా నీళ్ల తీసుకువస్తున్నాం. గ్రామంలో ఒకే ఒక బోరు మోటారు ఉండడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



వైద్య శిబిరం వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఐటీడీఏ పీఓ చాహత్ బాజ్‌పాయ్

నవతెలంగాణ-నార్నూర్

ప్రజలు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలనీ ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి చాహత్ బాజ్‌పాయ్ అన్నారు.శుక్రవారం మండలంలోని బాబేఝరీ గ్రామ పంచాయతీలో ఏజెన్సీ డీఎంహెచ్ఓ కుమ్ర బాలు ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరాన్ని ఆమె సందర్శించారు. సర్పంచ్ కైలేశ్వరి సాగర్, గ్రామ పటేల్ మడావి లింగు వ్యాధుల నిర్మూలన కోసం ఐటీడీఏ ద్వారా ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించడం హర్షనీయమన్నారు. ఈ సందర్భంగా పీఓ మాట్లాడుతూ ఏజెన్సీలో వ్యాధులు ప్రబల కుండా ఐటీడీఏ ద్వారా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. వైద్యులు పీహెచ్‌సీల్లో అందుబాటులో ఉండి సేవలు అందించేల ఆదేశాలు చేశామన్నారు. గిరిజనులకు మెరుగైనవైద్యం అందించడమే లక్ష్యంగా వైద్యులు కృషి చేయాలన్నారు. చలికాలంలో శ్వాసకోశ వ్యాధులతో ఇబ్బందులు పడకుండా పీహెచ్‌సీల్లో వైద్యులను అందుబాటులో ఉంచడం జరుగుతుందన్నారు. గిరిజనులు చలితీవ్రత ఎక్కుగా ఉన్నందున రక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. చిన్నారులు, వృద్ధులకు శ్వాసకోశ ఇబ్బందులు రాకుండా వైద్యుల సూచనలు పాటించాలని సూచించారు. నిత్యం ఇక నుంచి ఏజెన్సీ ప్రాంతాలు, తండాల్లో వైద్య శిబిరాలు నిర్వహించాలని ఏజెన్సీ డీఎంహెచ్ఓ కుమ్ర బాలుకు ఆదేశించారు. శిబిరంలో 45 మంది పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ రాంబాబు,హైదరాబాద్ వైద్య నిపుణులు హవీలా, మేఘన, రాహుఫ్, రిమ్స్ వైద్యులు వినయ్, మనోజ్, రాజమణి, కో ఆర్డినేటర్ మాణిక్ రావు, సీహెచ్‌ఓ లక్ష్మీ తులసి దాస్,హెచ్ఈఓ నాందేవ్,హెల్త్ సూపర్‌వైజర్ చరణ్‌దాస్, సతవ్వ, వైద్య సిబ్బంది శిరీష, అదీప్, ఈశ్వర్ గోకుల్, బాపురావ్, కేశవ్, ఈశ్వరి, కార్యదర్శి విజయ్ కుమార్, వైద్య సిబ్బంది, గ్రామ పెద్దలు, పటేళ్లు, నాయకులు ఉన్నారు.

పంట విక్రయాలు మార్కెట్ యార్డులోనే జరగాలి

- శిక్షణ సహాయ కలెక్టర్ వికాస్ మోహతే

నవతెలంగాణ-తలమడుగు

పత్తి పంట విక్రయాలు మార్కెట్ యార్డులోనే జరిగేలా అధికారులు పటిష్ఠ చర్యలు తీసుకోవాలని శిక్షణ సహాయ కలెక్టర్ వికాస్ మోహతే అన్నారు. శుక్రవారం మండలంలో ఆయన పర్యటించారు. కజ్జర్ల గ్రామంలో పర్యటించి రైతులతో మాట్లాడారు. గ్రామంలో రైతుల వద్ద నుంచి ప్రైవేట్ వ్యక్తులు కొనుగోళు చేస్తున్నట్లు ఆయన దృష్టికి వచ్చింది. మార్కెట్ యార్డులోనే పత్తిని విక్రయించి మద్దతు ధర పొందాలని సూచించారు. అనంతరం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి పలు రికార్డులను పరిశీలించారు. రైతులు పండించిన పంటలను నేరుగా జిల్లా కేంద్రంలోని మార్కెట్‌కు తీసుకువచ్చి విక్రయించాలని సూచించారు. ప్రస్తుతం సీసీఐ ద్వారా పత్తి క్వింటాళుకు రూ. 7020 మద్దతు ధర ఇస్తున్నారన్నారు. పంటలకు గిట్టుబాటు ధర మార్కెట్‌లో ఉంటుందన్నారు. గ్రామానికి వచ్చే ప్రయివేట్ వ్యక్తులకు పంటను అమ్మితే వారు తూకం, ధరలో కోత విధిస్తారని సూచించారు. రైతులకు మద్దతు ధరలు కల్పించేల ఉన్న వ్యవసాయ మార్కెట్‌లోనే పంటలను విక్రయించాలన్నారు. రైతులకు సమస్యలు ఎదురైతే సంబంధిత శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లాలన్నారు. అనంతరం మండల కేంద్రంలోని రైతులతో మాట్లాడుతూ వ్యవసాయానికి అవుతున్న ఖర్చుల గురించి అడిగి తెలుసుకున్నారు. రైతులు నిరాశ చెందకుండా పండించిన పంటలు మార్కెట్‌లో ధరలు పెరిగినప్పుడే విక్రయించాలన్నారు. ఆయన వెంట వ్యవసాయ శాఖ అధికారి పుల్లయ్య, మార్కెటింగ్ ఏడీ శ్రీనివాస్, మార్కెట్ కార్యదర్శి మధుకర్, తహసీల్దార్ రామ్మోహన్, జెడ్పీటీసీ గోక గణేష్ రెడ్డి, మండల కాంగ్రెస్ కన్వీనర్ కళ్యాణం రాజేశ్వర్, నాయకులు వెంకట్ యాదవ్, కమలాకర్ ఉన్నారు.



మార్కెటింగ్ ఏడీతో వివరాలు తెలుసుకుంటున్న శిక్షణ సహాయ కలెక్టర్ వికాస్ మోహతే

గ్రామాభివృద్ధి పనులు పరిశీలించిన ఎంపీడీఓ

నవతెలంగాణ-నార్నూర్



మండలంలోని గంగాపూర్ గ్రామపంచాయితీలో అభివృద్ధి పనులను ఎంపీడీఓ కావలా రమేష్ పరిశీలించారు. శుక్రవారం గ్రామంలో ఎంపీ నిధులతో నిర్మిస్తున్న మురికి కాలువ పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. పనుల్లో నాణ్యత పాటించే విధంగా చూడాలని కోరారు. ఆయన వెంట స్థానిక సర్పంచ్ యుూర్వేత రూపదేవ్, వైస్ ఎంపీపీ చంద్రశేఖర్, మాజీ ఎంపీపీ రమేష్ రాథోడ్ ఉన్నారు.

'మహాలక్ష్మి పథకంతో ఆటోలకు గిరాకీ లేదు'

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రభుత్వం మహాలక్ష్మీ పథకం ద్వారా ఉచిత ప్రయాణంతో ఆటో వారికి గిరాకీ లేకుండా పోతుందని ఆటో యూనియన్ ప్రతినిధి షేక్ అస్లాం అన్నారు. శుక్రవారం ఠాకూర్ హోటల్ వద్ద ఆటో డ్రైవర్లు ఆందోళన చేపట్టి ప్రభుత్వ తీరుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆటో యూనియేన్ నాయకుడు అస్లాం మాట్లాడుతూ ఉచిత ప్రయాణాన్ని తాము స్వాగతిస్తున్నామని, కానీ ఆటో వారి పరిస్థితులను కూడా ప్రభుత్వం గుర్తించాలన్నారు. ఎన్నికల ప్రచారంలో రాహుల్ గాంధీ ఆటో వెల్ఫర్ బోర్డును ఏర్పాటు చేస్తామని చెప్పారన్నారు. చలాన్లను రద్దు చేస్తామని హామీ ఇవ్వడం జరిగిందని గుర్తు చేశారు. ఫైనాన్స్‌పై ఆటోలను తీసుకున్నామని, రోజుకు ఒక్క ట్రిపు కూడా కావడం లేదన్నారు. దీంతో నెలకు రూ10 వేల కిస్తు కట్టడం కష్టంగా మారిందన్నారు. ప్రభుత్వం తమ గురించి ఆలోచించి ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డ్రైవర్లు షేక్ జావీద్, హజీ, రంజానీ బేగ్, సంజయ్ గౌడ్ పాల్గొన్నారు.

మొక్కులు తీర్చుకున్న మాజీ మంత్రి



నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

పట్టణ శివారులోని బెల్లూరి అయ్యప్ప ఆలయంలో మంత్రి జోగు రామన్న సతిమణి రమాదేవితో కలిసి దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అందులో భాగంగానే బెల్లంతో తులాభారం వేసి మొక్కుని సమర్పించుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకులు దూబే సాయి కృష్ణ తంత్రి వేద మంత్రోచ్చరణల నడుమ ఈ క్రతువు కొనసాగింది.

ఐటీడీఏ పీఓను కలిసిన ఆర్టీసీ డీఎం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి చాహత్ బాజ్‌పాయ్‌ను ఆదిలాబాద్ ఆర్టీసీ డిపో మేనేజర్ కల్పన మర్యాదపూర్వకంగా కలిశారు. శుక్రవారం ఉట్నూర్‌లోని ఆమె క్యాంప్ కార్యాలయంలో కలిసి పుష్పగుచ్ఛం అందించారు. అనంతరం ఆర్టీసీ ద్వారా హెవీ మోటర్ డ్రైవింగ్ స్కూల్‌ను కొనసాగిస్తున్నామని పీఓకు వివరించారు. ఐటీడీఏ ద్వారా నిరుద్యోగులకు డ్రైవింగ్ శిక్షణ అందజేయాలని విన్నవించగా పీఓ సానుకూలంగా స్పందించినట్లు ఆర్టీసీ డిపో మేనేజర్ కల్పన తెలిపారు.

సీఎం ప్రజావాణికి జిల్లా బాధితులు



నవతెలంగాణ-అదిలాబాద్‌టౌన్

రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ప్రజావాణికి ఆదిలాబాద్ నుండి పలువురు బాధితులు తరలివెళ్లారు. శుక్రవారం జరిగిన ప్రజావాణికి జిల్లా కేంద్రంలోని 170 ప్లాట్ లబ్ధిదారులు దాదాపు 35 మందికి పైగా వెళ్లి ఇందిరమ్మ ఇల్లు నిర్మించి ఇవ్వాలని కోరుతూ దరఖాస్తు చేసుకున్నారు. త్వరలో తమకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని ఫోన్ మెసేజ్ ద్వారా తెలియజేయడం ఆనందాన్ని ఇచ్చినట్లు బాదితులు పేర్కొన్నారు.

రిమ్స్ జూడాల అధ్యక్షుడిగా సందీప్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ రిమ్స్ జూడాల నూతన అధ్యక్షుడిగా డాక్టర్ సందీప్ చారీ నియమితులైనట్లు మాజీ జూడాల అధ్యక్షుడు అరుణ్ తెలిపారు. ప్రతి సంవత్సరం డిసెంబర్‌లో సీనియర్ పీజీ తమ అధికారాలను జూనియర్ పీజీలకు బదిలీ చేయడం సంప్రదాయమన్నారు. దాని ప్రకారం నూతన కార్యవర్గం ఎన్నికకైనట్లు పేర్కొన్నారు. రిమ్స్ జూడా అధ్యక్షుడుగా డాక్టర్ సందీప్ చారీ, వైస్ ప్రెసిడెంట్లుగా డాక్టర్ రాజు యాదవ్, డా. డి. కార్తీక్, డా.సి.హెచ్. మౌనిక, డాక్టర్ సూరజ్, ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ కారుణ్య కళంగి, డా.ఈ.అన్వేష్ ఉన్నట్లు తెలిపారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మంచిర్యాల
శనివారం | డిసెంబర్ 23, 2023 | www.navatelangana.com

కెరమెరిలో ఘనంగా ముందస్తు క్రిస్మస్ వేడుకలు

నవతెలంగాణ-కెరమెరి

మండలం కేంద్రంలోని స్థానిక గ్రేస్ మెమోరియల్ పాఠశాలలో ముందస్తు క్రిస్మస్ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్లు పంచిపెట్టారు. ఏసు క్రీస్తు జీవిత చరిత్ర పై ఏర్పాటు చేసిన విద్యార్థుల ప్రదర్శన చూపరులను ఆకట్టుకుంది. విద్యార్థుల నృత్యాలు, నాటికలు కన్నుల పండుగగా జరిగాయి. అనంతరం ప్రిన్సిపాల్ గంధం రత్నకుమారి మాట్లాడుతూ క్రీస్తు బోధనలు సదా ఆచరణీయమని అన్నారు. క్రీస్తు చూపిన మార్గంలో నడవాలని కోరారు. యేసు జననం ప్రపంచానికి ఒక మార్గదర్శనమని, ఆయన అడుగుజాడల్లో నడిచి శాంతికి చిహ్నంగా విద్యార్థులు నిలవాలని కోరారు. క్రిస్మస్, నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆలపించిన క్రైస్తవ భక్తి గీతాలు అలరించాయి. ఈ క్రిస్మస్ వేడుకల్లో పాఠశాల కరస్పాండెంట్ సంపత్ కుమార్ పాల్గొన్నారు.

ఎవరికీ భారం కావద్దని వికలాంగుడి ఆత్మహత్య

నవతెలంగాణ-దండేపల్లి

ఓ పక్క అంగవైకల్యం మరో పక్క భార్య మృతి చెందడంతో ప్రయివేట్ ఉద్యోగి అయిన కొడుకుకు బారం కాకూడదని హాజీపూర్ మండలం ముల్కల్ల గ్రామానికి చెందిన చుంచు రాజలింగు(55) దండేపల్లి మండలం గూడెం వద్ద పురుగుల మందు తాగి ఆత్మ హత్యకు పాల్పడ్డాడు. కుటుంబసభ్యులు, దండేపల్లి ఎస్సై ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. ముల్కల్ల గ్రామానికి చెందిన చుంచు రజలింగు వ్యవసాయ పనులు చేస్తూ వుండగా గత 10 ఏళ్ల క్రితం వెన్నుముక సమస్యతో కాళ్ళు పని చేయడంలేదు. దీంతో చేతి కర్రల సహాయంతో నడిచేవాడు. 5 ఏండ్ల క్రితం భార్య క్యాన్సర్ తో మరణించింది. అప్పటి నుండి కుంగిపోయిన రాజలింగంకు ఆరోగ్యం పూర్తిగా సహకరించకుండా పోయింది. ప్రయివేట్ లెక్చరర్‌గా పనిచేసే కొడుకుకు భారం కాకూడదని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు.

ఘనంగా రామానుజన్ జయంతి వేడుకలు



నవతెలంగాణ-దండేపల్లి

గణిత మేధావి రామానుజన్ జయంతి వేడుకలను శుక్రవారం దండేపల్లి మండలంలోని పలు పాఠశాలలలో ఘనంగా నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ పాఠాశాలలో కస్తుర్బ గాంధీ విద్యాలయంలో, కోర్విచేల్మ ప్రభుత్వ ఉన్నత పాఠాశాలలో రామానుజన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళ్ళు అర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థినీ, విద్యార్థులకు నిర్వహించిన పలు పోటీలలో విజేతలకు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠాశాల ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ రామానుజన్ జీవిత విశేషాలను వివరించి ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. చిన్ననాటి నుండే రామానుజన్ మాదిరిగా గణితంలో ప్రావిణ్యత సంపాదించినట్లైతే అన్ని విషయాలలో సైతం అవగాహన ఏర్పడుతుందన్నారు. ఈ కార్యక్రమం సందర్భంగా విద్యార్థులు గణిత నమూనాలు తయారు చేశారు. విలువలను తెలియజేశారు. ఇవి నిత్య జీవితంలో అందరికీ ఉపయోగపడతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండలంలోని ఆయా పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జన్నారం : గణిత శాస్త్రంపై విద్యార్థులు ఆసక్తిని పెంచుకోవాలని జన్నారం ఎఫ్ఆర్ఓ హఫీసుద్దీన్ సూచించారు. గణిత శాస్త్రవేత్త సీవీ.రామన్ జయంతిని పురస్కరించుకొని శుక్రవారం మండల కేంద్రంలోని స్లేట్ పాఠశాలలో ఏర్పాటు చేసిన గణితశాస్త్రం దినోత్సవాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు గణితానికి సంబంధించిన వివిధ అంశాలపై ప్రదర్శనలు నిర్వహించారు. గణితం జీవితంలో ఎంతో ముఖ్యమైనది అన్నారు. ప్రతిరోజు మనం చేసే పనులలో గణితం ఇమిడి ఉంటుందన్నారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ శ్రీకాంత్‌రెడ్డి, స్లేట్ హైస్కూల్ ఫౌండర్ ఏనుగు సుభాష్‌రెడ్డి, స్లేట్ హైస్కూల్ అడ్మినిస్ట్రేటర్ ఏనుగు రజితరెడ్డి, వైస్ ప్రిన్సిపల్ పూజ, బీట్ ఆఫీసర్ రహీం, ఉపాధ్యాయులు కృష్ణ, కిరణ్, రాజన్న, రంజిత్, భాను చందర్ పాల్గొన్నారు.

మండల సర్వ సభ్య సమావేశం వాయిదా

నవతెలంగాణ-తాండూర్

శుక్రవారం జరగవలసిన తాండూరు మండల సర్వసభ్య సమావేశం కోరం లేక వాయిదా పడింది. మండల అధ్యక్షుడు పూసాల ప్రణయ్ కుమార్‌తో పాటు సర్పంచులు ఎంపీటీసీలు ఎవ్వరు హాజరు కాకపోవడంతో కోరం లేక సమావేశాన్ని వాయిదా వేసినట్లు ఎంపీడీవో ప్రవీణ్ కుమార్ ప్రకటించారు. వ్యవసాయ అధికారి కిరణ్మయి ఏఈఓ అప్పలనాయుడు, విద్యుత్ శాఖ అధికారి ప్రభాకర్, పశు సమర్థత శాఖ వైద్యులు భూమన్న, పీవీ నరసింహారావు, ఎంపీ ఓ సత్యనారాయణ, ఏపీఎం పుమా నాయక్ స్త్రీ శిశు సంక్షేమ శాఖ సూపర్‌వైజర్లు మమత, స్వరూప రాణి సమావేశానికి హాజరయ్యారు.

సంక్షేమ పథకాలను సధ్వినియోగం చేసుకోవాలి



నవతెలంగాణ-జైపూర్

బడగుబహీణవర్గాల అభ్యున్నతి కోసం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను గ్రామీణ ప్రజలు సధ్వినియోగం చేసుకోవాలని సంబంధిత శాఖల అధికారులు సూచించారు. భారత్ వికసిత్ సంకల్ప యాత్ర కార్యక్రమంలో భాగంగా శుక్రవారం సంబంధిత శాఖ అధికారులు శివ్వారం గ్రామ పంచాయతీ సర్పంచ్ ఆవిడపు గణేష్ అధ్యక్షతన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల పట్ల గ్రామస్థులకు అవగాహణ కల్పించారు. బడుగు బలహీణ వర్గాల వారి శ్రేయస్సు కోరి అమలు చేస్తున్న ఆయుష్మాన్ భారత్, గరీబ్ కళ్యాణ్, అన్న యోజన, ఆవాస్ యోజన, ఉజ్వల యోజన, కిసాన్ సమ్మాన్ నిధి, జీవన జ్యోతి భీమా తదితర పథకాల ద్వార కల్పించు ప్రయోజనాలను వివరించారు. అదేవిధంగా ఈ పథకాల ద్వార ప్రయోజనం పొందిన గ్రామ పంచాయతి ప్రజల మనోభావాలను అడిగి తెల్సుకున్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖ అధికారులతో పాటు గ్రామస్థులు పాల్గొన్నారు.

జమా మసీద్ నూతన కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-జన్నారం

మండల కేంద్రంలోని జమా మసీద్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. శుక్రవారం ఆ మసీదులో మైనార్టీ కమిటీ నాయకులు, మైనార్టీ సోదరులు సమావేశం నిర్వహించారు. మసీద్ కమిటీ అధ్యక్షులుగా మొహమ్మద్ హుస్సేన్, వైస్ ప్రెసిడెంట్‌గా సర్దార్ ఖాన్, కోశాధికారిగా ఫహీంలను ఎన్నుకున్నారు. అలాగే కమిటీ సభ్యులుగా ఖాదర్‌ఖాన్, సాదత్, వసీం, అజార్, నది, వాజిద్, ఖమ్రుద్దీన్, జాకీర్, నజీర్ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మసీద్ అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామన్నారు.

సింగరేణి ఆవిర్భావ దినోత్సవానికి ఏర్పాట్లు పూర్తి

నవతెలంగాణ-నస్పూర్

శ్రీరాంపూర్ ఏరియాలోని ప్రగతి మైదానంలో శనివారం నిర్వహించనున్న సింగరేణి ఆవిర్భావ వేడుకలకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. డిసెంబర్ 23న సింగరేణి ఏర్పడిన సందర్భంగా ప్రతి సంవత్సరం సింగరేణి వ్యాప్తంగా వేడుకలను ఘనంగా నిర్వహిస్తారు. శ్రీరాంపూర్ ఏరియాలో ముఖ్యఅతిథిగా జీఎం సంజీవరెడ్డి, సేవా అధ్యక్షురాలు రాధాకుమారి పాల్గొననున్నారు.

కార్మిక, కర్షకుల శ్రేయస్సు కోసం కాక కృషి

నవతెలంగాణ-తాండూర్

నిరుపేద కార్మిక కర్షకుల హక్కుల సాధన కోసం వారి శ్రేయస్సు కోసం స్వర్గీయ గడ్డం వెంకటస్వామి ఎంతగానో కృషి చేశారని బెల్లంపల్లి కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు మాజీ మున్సిపల్ చైర్మన్ ముచ్చర్ల మల్లయ్య తెలిపారు. శుక్రవారం బెల్లంపల్లి కాంగ్రెస్ కార్యాలయం వద్ద దివంగత గడ్డం వెంకట స్వామి(కాకా) 9వ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షుడు మాట్లాడుతూ కార్మిక, కర్షకుల శ్రేయస్సు కోసం కాకా కృషి చేశారని తెలిపారు. హైదరాబాదులోని నిరుపేదల సొంత ఇంటి స్థలాల కోసం పోరాటం చేశారని కొనియాడారు. పేద ప్రజలతో ప్రభుత్వ స్థలంలో గుడిసెలు వేయించి గుడిసెల వెంకటస్వామిగా పేరుగాంచారన్నారు. అదే సందర్భంలో ఆల్ ఇండియా హాట్స్ యూనియన్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. హైదరాబాదులో రిక్షా కార్మికులహక్కుల పరిరక్షణకు పదివేల మంది కార్మికులతో ర్యాలీ నిర్వహించారని గుర్తు చేశారు. కేంద్ర కార్మిక శాఖ మంత్రిగా పనిచేసిన కాక కార్మికుల పెన్షన్ పథకం అమలు కోసం ఎంతగానో కృషి చేశారన్నారు. కాకా కృషి ఫలితంగా నేడు రిటైర్మెంట్ కార్మికులు లబ్ధి పొందుతున్నారని పేర్కొన్నారు. కాక అడుగుజాడల్లోనే వారి ఇద్దరి కుమారులు బెల్లంపల్లి ఎమ్మెల్యే వినోద్, చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ పేద ప్రజల అభ్యున్నతికి పాటుపడతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మల్లారపు చినరాజం బండి రాము, మేకల శ్రీనివాస్, రామగిరి శ్రీనివాస్, దాసరి ప్రతాప్, లెంకల శ్రీనివాన్, చింతపండు శ్రీనివాస్, మొగురం కన్నయ్య, దాసరి చిన్నులు, ఎల్తూరి శంకర్, పోచంపల్లి హరీష్, సాదయ్ గొడుగు రఘు, మంగ,



రియాజ్, సమత్, కేశవులు, ఆసిఫ్, కిరణ్, కాసర్ల యాదగిరి, గోపాల్, జాడి మహేష్, సాయి కిరణ్, బర్రె మదునయ్య, పాల్గొన్నారు.

కాసిపేట : మండల కేంద్రంలో మాజీ కేంద్ర మంత్రి, దళితుల ఆశ జ్యోతి పేదల పెన్నిధి కాకా వెంకటస్వామి 9వ వర్ధంతిని శుక్రవారం కాంగ్రెస్ నాయకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాకా వెంకటస్వామి చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళ్ళర్పించారు. ఈ కార్యక్రమంలో ఐఎన్టీయూసీ సెంట్రల్ సెక్రటరీ రావర్తి శ్రీనివాస్, మాజీ జడ్పీటీసీ రౌతు సత్తయ్య, మాజీ సహకార చైర్మన్ పూస్కూరి వంశీకృష్ణారావు, కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు సిద్దం తిరుపతి, నస్పూరి నర్సింగం, ఉత్తూరి సత్తయ్య, సామల లక్ష్మణ్, సిద్ధం రాములు, గోదార్ల శంకర్, మేడ చంద్రయ్య, సిద్ధం బాపు, బొడ్డు శంకర్, రత్నం శ్రీనివాస్, గోనె శ్రీధర్ పాల్గొన్నారు.

జైపూర్ : పెద్దపల్లి మాజీ ఎంపీ, సీడబ్ల్యూసీ మెంబర్ గడ్డం వెంకటస్వామి (కాక) 9వ వర్ధంతి వేడుకలను శుక్రవారం కాంగ్రెస్ నాయకులు ఘనంగా జరుపుకున్నారు. కాంగ్రెస్ జిల్లా నాయకులు రిక్కుల శ్రీనివస్‌రెడ్డి, మండల అధ్యక్షుడు మహమ్మద్ ఫయాజ్‌తో పాటు వివిధ గ్రామాలకు చెందిన సర్పంచులు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీ సభ్యులు వివిధ గ్రామాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు కాక వెంకటస్వామి చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వేధిక మీదుగా పలువురు నాయకులు కాక వెంకటస్వామి పేదల అభ్యున్నతి కోసం కృషి చేసిన తీరును గుర్తు చేసుకున్నారు. అదేవిధంగా గోదావరిఖని పట్టణం గంగానగర్‌లో గల కాక వెంకటస్వామి విగ్రహానికి పూల మాల వేసి నివాళ్లు అర్పించారు.

గుర్తింపు సంఘం ఎన్నికల్లో సీఐటీయూని గెలిపించాలి



నవతెలంగాణ-నస్పూర్

నీటి నిజాయితీతో కార్మికుల సమస్యల పట్ల నిబద్దతతో పనిచేసే, కార్మికుల హక్కులపై పోరాడే సీఐటీయూను గెలిపించాలని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్(సీఐటీయూ) జనరల్ సెక్రెటరీ మంద నరసింహారావు, డిప్యూటీ జనరల్ సెక్రెటరీ నాగరాజు గోపాల్ అన్నారు. శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కే-5, ఎస్ఆర్పీ-1 గనులలో నిర్వహించిన గేట్ మీటింగ్‌లో వారు మాట్లాడారు. అవకాశవాద అవినీతి కర విధానాలు సింగరేణి కార్మిక నాయకులలో పేరిగాయని, చొక్కాలు మార్చినట్లు నాయకులు కండువాలు మారుస్తూ సంఘాలను మారుస్తూన్నారని, ప్రస్తుతం సింగరేణి కార్మిక నాయకులను చూస్తే కార్మికులకు అసహ్యం వేస్తుందని పేర్కొన్నారు. గతంలో ఏఐటీయూసీ లో కూడా ఇదే విధానం కొనసాగిందని, ఇప్పుడు టీబీజీకేఎస్‌లో కూడా ఇదే విధానం కొనసాగుతుందని శ్రీరాంపూర్ ఏరియాలో గతంలో ఏఐటీయూసీలో పనిచేసిన నాయకులు టీబీజీకేఎస్‌లో చేరడం, వాళ్లే మళ్ళీ ఏఐటీయూసీలో చేరడం, తర్వాత ఐఎన్టీయూసీలోకి మారడం జరుగుతుందని అన్నారు. ప్రస్తుతం కార్మిక సంఘాల నాయకులందరూ ప్రతిపనికి ఒక రేటు కట్టి డబ్బులు వసూలు చేస్తూ యాజమాన్యానికి తొత్తులుగా వ్యవహరిస్తున్నారని, కార్మికుల హక్కులను తాకట్టు పెడుతున్నారని ఆరోపించారు. డిపెండెంట్ ఎంప్లాయిమెంట్ పోవడానికి గతంలో గుర్తింపు సంఘంగా ఉన్న ఏఐటీయూసీ ముఖ్య కారణమని, యాజమాన్యంతో రాతపూర్వకంగా ఒప్పందం చేసుకున్నారని ఆరోపించారు. ఏఐటీయూసీ గెలిసిన భూపాలపల్లిలో 50 మంది కార్మికులు డిస్మిస్ చేస్తే ఎందుకు ఆపలేకపోయారని, ఐఎన్టీయూసీ గతంలో గుర్తింపు సంఘంగా ఉన్న సమయంలో కోల్ పిల్లర్లకు మైన్ యావరేజ్ ఇప్పించకుండా ఒప్పందం చేసుకున్న ఘనత ఉందని ఎద్దేవా చేశారు. గెలుపు ఓటములతో సంబంధం లేకుండా సీఐటీయూ ప్రతి సమస్యలలో కార్మికులకు వెన్నంటి ఉంటుందని, ఎప్పటికప్పుడు కార్మికులను చైతన్య పరుస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు గుల్ల బాలాజీ, కార్యదర్శి గోదారి భాగ్యరాజ్, ఆర్గనైజింగ్ సెక్రటరీ వెంగళ శ్రీనివాస్, వైస్ ప్రెసిడెంట్ కస్తూరి చంద్రశేఖర్, శ్రీనివాస్, అజయ్, బానేష్, సుధాకర్, కేసిపెద్ద శ్రీనివాస్, పరంధాములు పాల్గొన్నారు.

పోరాటాలతోనే బవిష్యత్ ఆధారపడి ఉంది : టీఎన్టీయూసీ

నవతెలంగాణ-నస్పూర్

సింగరేణి కార్మికుల పోరాటాల పైన వారి సమస్త భవిష్యత్తు ఆధారపడి ఉందని టీఎన్టీయూసీ నాయకులు అన్నారు. శుక్రవారం శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కే-7గనిపై సింగరేణి గుర్తింపు సంఘం ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికుల భవిష్యత్తు వారి చేతుల్లోనే ఉందని కొన్ని యూనియన్లు చెప్పే మాయమాటలను నమ్మవద్దని, కార్మిక పక్షాన పోరాడే సంఘాన్ని గుర్తింపు సంఘంగా గెలిపించాలని కోరారు. సింగరేణి ఎన్నికల విధానం కొందరికి తిరుగులేని అధికారానికి తెరలేపిందని, చట్టపరంగా రిజిస్టర్ అయిన ప్రతి సంఘాన్ని సింగరేణి యజమాన్యం గుర్తించాలని, సింగరేణి కార్మిక వర్గ హక్కుల పరిరక్షణకు టీఎన్టీయూసీ అగ్రభాగాన ముందుంటుందని తెలుగుదేశం పాలనలో పరుగు పందెంలో ఉద్యోగాలు తెచ్చుకోగా నేడు ఉద్యోగాలు ఇవ్వలేని పరిస్థితి నెలకొంది అన్నారు. సింగరేణి బీఐఎఫ్ఆర్‌లోకి వెళ్లినప్పుడు రూ.1263 కోట్లు కేంద్ర ప్రభుత్వం వద్ద నుంచి అప్పుగా తీసుకువచ్చి సింగరేణి సంస్థను బీఐఎఫ్ఆర్ నుంచి రక్షించిన



ఘనత ఆదుకోవడంలో చొరవ చూపిన సంఘం టీఎన్టీయూసీదని తెలిపారు. 1985లో ఉమ్మడి రాష్ట్రంగా ఉన్నప్పుడు టీడీపీ హయాంలో సింగరేణిలో 35 వేల నుండి 40,000 వరకు నిరుద్యోగులను పరుగు పందెం ద్వారా ఒక్క నయా పైసా తీసుకోకుండా ఉద్యోగాలను భర్తీ చేసిన ఘనత టీడీపీదన్నారు. ఈ కార్యక్రమంలో టీఎన్టీయూసీ ప్రధాన కార్యదర్శి మణిరాం సింగ్, నాయకులు పెద్ద పెళ్లి సత్యనారాయణ, జీవరత్నం, గద్దల నారాయణ, కుంచె భూపతి, గరిగంటి రాజయ్య, నిమ్మకాయల ఏడుకొండలు, చిటికెల రాయలింగు, దామోదర్‌రెడ్డి, ఏ రాజనర్సు, ఎస్ రాజయ్య, ఎండీ హాసన్, బొల్లు మల్లయ్య, పి.యాదగిరి, ఎండి సుభాన్, డి.రాజు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

కేసులు సత్వరమే పరిష్కరించాలి

● జైపూర్ ఏసీపీ మోహన్

నవతెలంగాణ-నస్పూర్

అందుబాటులో ఉన్న నూతన టెక్నాలజీ సహాయంతో ఎటువంటి కేసులైనా త్వరగా పరిష్కరించేలా పోలీసులు చర్యలు తీసుకోవాలని జైపూర్ ఏసీపీ మోహన్ అన్నారు. వార్షిక తనిఖీలలో భాగంగా శ్రీరాంపూర్ సర్కిల్ ఆఫీస్, పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం ఏసీపీ తనిఖీ చేశారు. అధికారులతో కలిసి పోలీస్‌స్టేషన్ ఆవరణ, పరిసరాలను పరిశీలించారు. రిసెప్షన్, బ్లూ కోల్ట్, క్రైం టీం, కోర్ట్ డ్యూటీ ఆఫీసర్, స్టేషన్ రైటర్, క్రైం రైటర్, ప్రాసెస్, సమన్స్, వారెంట్స్ ఆఫీసర్, సెక్షన్ ఇన్‌ఛార్జి, టెక్ టీం, ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్, ఎస్‌హెచ్ఓ వర్టికల్స్ పనితీరుని సీసీటీఎన్ఎస్, టేక్డేటమ్, అప్లికేషన్ల పనితీరుని తెలుసుకొని సిబ్బందికి తగు సూచనలు చేశారు. పెండింగ్ కేసుల ఫైల్స్, రికార్డులను పరిశీలించారు. అలాగే నేరాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ



ప్రజలకు అందుబాటు లో ఉంటూ, చట్టపరిధిలోని అన్ని సమస్యలు పరిష్కరిస్తూ, ప్రజల మన్ననలు పొందాలని సూచించారు. 100 డయల్ ఫిర్యాదులపై తక్షణమే స్పందన ఉండాలని, బీట్లు, పెట్రోలింగ్ ముమ్మరంగా నిర్వహిస్తూ నేరాల నియంత్రణకు కృషి చేయాలని అన్నారు. రోడ్డు భద్రత, సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీరాంపూర్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ రమేష్ బాబు, ఎస్సై రాజేష్ ఉన్నారు.

ఐఎన్టీయూసీలో విభేదాలు



నవతెలంగాణ-నస్పూర్

ఐఎన్టీయూసీలో విభేదాలకు తెరలేసింది. శుక్రవారం ఐఎన్టీయూసీ నాయకులు నస్పూర్ శ్రీరాంపూర్ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో యూనియన్ నాయకులు మాట్లాడుతున్న సమయంలో టీబీజీకేఎస్ ఏరియా అగ్ర నాయకులు ఐఎన్టీయూసీలో చేరడం పట్ల పలువురు అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో ఆ సంఘం నాయకుల మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది. ఐఎన్టీయూసీ ఏరియా నాయకులు సమావేశం నిర్వహించి కింది క్యాడర్ను సంప్రదించకుండానే ఇతర యూనియన్ నాయకులను చేర్చుకోవడంపై అసహనం వ్యక్తం చేశారు. మొదటినుంచి యూనియన్‌లో పనిచేస్తున్న నాయకులను పక్కనపెట్టి, కొత్తగా యూనియన్‌లో చేరుతున్న నాయకులకు ప్రాధాన్యత ఇవ్వడంతో యువ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయంపై ఐఎన్టీయూసీలో చేరిన సురేందర్‌రెడ్డి మాట్లాడుతూ కార్మికుల పక్షాన పోరాడిన టీబీజీకేఎస్ సంఘంలో ఏరియా ఉపాధ్యక్షుడిగా పని చేసినట్లు, మాజీ సీఎం కేసీఆర్ సింగరేణి గుర్తింపు ఎన్నికల్లో టీబిజీకేఎస్ ను పోటీ చేయద్దని చెప్పడంతో యూనియన్ వీడి జనక్ ప్రసాద్ ఆహ్వానం మేరకు ఐఎన్టీయూసీలో చేరినట్లు పేర్కొన్నారు. యూనియన్ బలోపేతం చేస్తానన్నారు.

29న దేవాపూర్ ఓరియంట్ యూనియన్లతో సమావేశం

నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని దేవాపూర్ ఓరియంట్ కంపెనీకి సంబంధించి పది యూనియన్లు తమ వివరాలతో ఆదిలాబాద్ డిప్యూటీ లేబర్ కమీషనర్, రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో డిసెంబర్ 29న హాజరు కావాలని డిప్యూటీ లేబర్ కమీషనర్ ఆయా యూనియన్లకు మొదటి నోటీస్ జారీ చేశారు. యూనియన్ల అర్హత, గుర్తింపు, కార్మిక గుర్తింపు సంఘం ఎన్నికలను నిర్వహించడానికి ఆదిలాబాద్ డిప్యూటీ కమీషనర్ ఆఫ్ లేబర్, రిటర్నింగ్ అధికారి, ధ్రువీకరణ అధికారిగా నియమించారు. ఈ మేరకు ఎన్నికల్లో యూనియన్ల అర్హత, సభ్యుల ధృవీకరణ కోసం యూనియన్లకు సంబంధించి రికార్డులను, రిజిస్టర్లతో ఈ నెల డిసెంబర్ 29 ఉదయం 11:30 గంటలకు ఆదిలాబాద్‌లోని డిప్యూటీ లేబర్ కమీషనర్ కార్యాలయంలో హాజరు కావాలని యూనియన్లకు నోటీసు జారీ చేశారు. అండర్ టేకింగ్ సర్టిఫికెట్, అఫిలియేషన్ సర్టిఫికెట్, ఒరిజినల్ యూనియన్ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్, ఒరిజినల్ యూనియన్ నియమాలు (బైలాస్), వార్షిక రిటర్న్స్, యూనియన్ సభ్యులు, ఆరు నెలల వ్యవధిలో కనీసం 3 నెలల సబ్‌స్క్రిప్షన్‌లు చెల్లించిన వారు మూడు కాపీలలో సభ్యత్వం జాబితా, ఖాతాల రిజిస్టర్, రసీదు పుస్తకాలతో, సభ్యత్వ జాబితా విభాగం, డిపార్ట్‌మెంట్ వారీగా డిజిగ్నేషన్, టోకెన్ నెంబర్ సిద్ధం చేసి అన్ని వివరాలతో హాజరు కావాలని సూచించారు. యూనియన్లతో సమావేశం అనంతరం, ఓరియంట్ కంపెనీ కార్మికుల ఓటరు జాబితా, ఇతర అన్ని అంశాలు పూర్తి చేసిన అనంతరం ఓరియంట్ కంపెనీ గుర్తింపు సంఘం ఎన్నికలపై అధికారులు వివరాలు ప్రకటించనున్నారు.

7న చలో హైదరాబాద్‌ను విజయవంతం చేయాలి

నవతెలంగాణ-జన్నారం

ఆటో, క్యాబ్ డ్రైవర్ల సమస్యల పరిష్కారం కోసం నిర్వహించే చలో హైదరాబాద్‌ను విజయవంతం చేయాలని రిపబ్లిక్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర కన్వీనర్ గవ్వల శ్రీకాంత్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆటో, క్యాబ్ డ్రైవర్ల సమస్యలను కాంగ్రెస్ ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లేందుకు జనవరి 7న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని వెల్లడించారు. ఈ కార్యక్రమానికి ఆటో డ్రైవర్లు పెద్ద ఎత్తున రావాలని ఆయన కోరారు.

పంటలకు మద్దతు ధర కల్పించాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

రైతుల పండించే వివిధ రకాల పంటలకు మద్దతు ధర కల్పించాలని మంగి ఇంద్రవెల్లి మావోయిస్టు ఏరియా కమిటీ కార్యదర్శి వర్గీస్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రైతుల పంటకు సంబంధించి కొనుగోలు వ్యవస్థను ప్రభుత్వాలు పట్టించుకోకపోవడంతో దళారుల వ్యవస్థ పెరిగిందని దీనితో రైతులు ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. పత్తికి రూ.17000, కందులకు రూ.13000, సోయాబీన్ రూ.10000, పసుపుకు రూ.10000, వడ్లకు రూ.8000 గిట్టుబాటు ధర కల్పించడంతోపాటు తాలూ తప్ప తేడా లేకుండా చిరుధాన్యాలు కొనుగోలు చేయాలని ప్రకటనలో డిమాండ్ చేశారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించి దళారి వ్యవస్థనుండి రైతులను కాపాడాలని పేర్కొన్నారు.

ఘనంగా గణిత దినోత్సవం

నవతెలంగాణ-చింతలమానేపల్లి

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలాలో 134 జయంతిని ఘనంగా నిర్వహిస్తూ, గణిత పితామహుడు శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. అనంతరం పాఠశాల ఉపాధ్యాయులు దేవాజీ మాట్లాడుతూ శ్రీనివాస రామానుజన్ జీవిత విశేషాలు తెలుపుతూ కడు బీదరికంలో ఉన్నప్పటికీ గణిత అభివృద్ధికై ఎంతో కృషి చేశారన్నారు. అయన అతి చిన్న వయస్సు 33 సంవత్సరాలలోనే మరణించి ఉండక పోతే మరిన్ని గణిత సూత్రలు కనిపెట్టి, ప్రపంచం మెచ్చిన గణిత శాస్రవేత్త అయ్యేవారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఆత్మరాం పాల్గొన్నారు.

ప్రమాదం జరిగేదాకా పట్టించుకోరా..?

నవతెలంగాణ-జన్నారం



మండల కేంద్రంలోని జింకల పార్కు సమీపన సబ్ స్టేషన్ ముందు రోడ్డు కోతకు గురైంది. ఆ రోడ్డుకు మారమ్మతులు చేసి ప్రమాదాలు జరగకుండా చూడాలని సీపీఐ మండల కన్వీనర్ మామిడి విజయ్ అన్నారు. శుక్రవారం ఆ స్థలాన్ని పరిశీలించారు. మంచిర్యాల, అదిలాబాద్, నిర్మల్ జిల్లాలకు వెళ్లే ప్రధాన రహదారి కావడంతో, వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటుందన్నారు. పైగా ఆ ప్రదేశం మూలమలుపు ఉండడంతో ప్రమాదాలు సంభవించే అవకాశం ఉందని దీనిపై అధికారులు స్పందించాలని కోరారు. అక్కడ మట్టిని పోయించి కోతకు గురైన రోడ్డును సరి చయాలని కోరుతున్నామన్నారు.

ఘనంగా కాక, పీవీరావు వర్ధంతి వేడుకలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



మాల సంక్షేమ సంఘం అడాక్ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం సంఘ భవనంలో కాకా వెంకటస్వామి, పీవీ రావు వర్ధంతులను నిర్వహించారు. ఈసందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ నేటి యువత కాకా, పీవీ రావు ఆశయాలను కొనసాగించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ చైర్మెన్ సింగరి అశోక్, సంటి రవి, మైల లచ్చన్న, మేకల మల్లన్న, బంజ భూమన్న, చిలుక పోచన్న, దాసరి బాబన్న, గడుగు నరేందర్, రాళ్ల బండి శంకర్, సుధాకర్, ప్రభాకర్, మల్లెల అశోక్, అల్లూరి భూమన్న, సత్యనారాయణ, వెంకటస్వామి, నరేందర్, జయకర్, మాల సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ప్రజారోగ్య సంచాలకులను కలిసిన రిమ్స్ డైరెక్టర్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



ప్రజా ఆరోగ్య సంచాలకులుగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ బి.రవీంద్ర నాయక్, వైద్యవిద్య సంచాలకులు డా. త్రివేణిలను ఆదిలాబాద్ రిమ్స్ డైరెక్టర్ డా. జైసింగ్ రాథోడ్ కలిశారు. శుక్రవారం హైదరాబాద్‌లోని వారి కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభకాంక్షలు తెలిపారు. ఆయన వెంట వైద్య ప్రజారోగ్య ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు బండారి కృష్ణ, సంఘం సీనియర్ నాయకులు అక్బర్, రవీందర్ ఉన్నారు.

ఘనంగా జాతీయ గణిత దినోత్సవం



ఆదిలాబాద్‌టౌన్‌లో..

నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్

గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ జయంతి వేడుకలను శుక్రవారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రామానుజన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయా పాఠశాలల్లో మ్యాథ్స్‌కు సంబంధించి వివిధ ప్రదర్శనాలను విద్యార్థులు తయారు చేసి ప్రదర్శించారు. ఇందులో భాగంగానే పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు క్విజ్, చిత్రలేఖనం, ఉపన్యాసం, వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. ప్రిన్సిపాల్ కోవ విఠల్ మాట్లాడుతూ శ్రీనివాస రామానుజన్ నిరుపేద కుటుంబంలో జన్మించినప్పటికి తాను ఇష్టపడిన గణితశాస్త్ర అధ్యాయం కోసమే అహర్నిశలు కృషి చేసి భారత దేశానికి వన్నె తెచ్చారని తెలిపారు. అతితక్కువ కాలం జీవించినప్పటి ప్రపంచ మేధావి అనే పేరు తెచ్చుకున్నారని, విద్యార్థులు కూడా చదువుపై ఏకాగ్రతతో కష్టపడితే ఖచ్చితంగా విజయం సాధిస్తారని అన్నారు. కార్యక్రమంలో గణిత అధ్యాపకులు దెబ్బడి శ్రీనివాస్, హబీబ్ పాల్గొన్నారు.

ఆదిలాబాద్ రూరల్ : మండలంలోని చాందా(టి) జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ గణిత దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. విద్యార్థుతో గణిత గుర్తులు, ముగ్గులు వేయించారు. అనంతరం శ్రీనివాస రామానుజన్ జీవిత చరిత్ర సినిమాను ప్రదర్శించారు. విద్యార్థులకు గణితం పట్ల ఆసక్తి పెంపొందించడం కోసం కార్యక్రమాన్ని నిర్వహించామని హెచ్ఎం శ్యామ్‌రావ్ తెలిపారు. విద్యార్థులు చిన్నతనం నుంచే గణితం పట్ల మక్కువ పెంచుకొని మంచి స్థానాలలో స్థిర పడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఆరె భాస్కర్, విద్యాసాగర్ రావు, మధుకర్ వర్మ, రామ్ కుమార్ పాల్గొన్నారు.



బోథ్‌లో..

ధర్మ విద్యాలయ పాఠశాలలో...

పట్టణంలోని ధర్మ విద్యాలయ పాఠశాలలో శ్రీనివాస రామానుజన్ జయంతి సందర్భంగా జాతీయ గణిత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు రూపొందించిన గణిత మోడల్‌లను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ స్వప్న లత, యాజమాన్య కమిటీ సభ్యుడు శ్రీనివాస్ గౌడ్, ఉపాధ్యాయులు పాల్గొని ప్రతిభ కనబర్చిన విద్యార్థులను అభినందించారు.

బోథ్ : మండల కేంద్రంతో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో గణిత దినోత్సవాన్ని ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాల్లో ఘనంగా జరుపుకున్నారు. మండల కేంద్రంలోని వేదం పాఠశాల, విజ్ఞాన్, నాగభూషణం, శ్రీ సరస్వతి విద్య మందిర్‌తో పాటు సోనాలలోని వివేకానంద, ఉషోదయ, పాఠశాలలో గణిత దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం శ్రీనివాస రామానుజం చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. గణితంలో ఆయన సేవలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమాల్లో ఎస్సై రాము, ఎంపీడీఓ సుశీల్ రెడ్డి, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నార్నూర్ :గణిత శాస్త్ర పితామహుడు శ్రీనివాస్ రామానుజన్ జన్మదినాన్ని పురస్కరించుకొని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలో గణిత శాస్త్ర దినోత్సవ వేడుకలను ఉపాధ్యాయులు విద్యార్థులు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా శుక్రవారం నార్నూర్ మండలంలోని ఆయా పాఠశాలతో పాటు గాదిగూడ మండల కేంద్రంలోని కేజీబీవి పాఠశాలలో ఎస్ఓ పి ప్రియాంక ఉపాద్యాయ సిబ్బంది ముందుగా రామానుజన్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.విద్యార్థులతో గణిత శాస్త్ర ప్రాజెక్టు ప్రదర్శన చేయించారు.గణిత ఉపాధ్యాయురాలు ఉమా దేవి,ఛాయా కుమారికి శాలువాతో సత్కరించారు.కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది విద్యార్థులు ఉన్నారు.

ముధోల్ : మండల కేంద్రంలోని రబింద్ర, అక్షర, లిటిల్ ఫ్లవర్, సరస్వతి శిశు మందిర్ ఉన్నత పాఠశాలలో జాతీయ గణిత దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ముధోల్ స్కూల్ కాంప్లెక్స్ అమిత్ కుస్రో, అమ్మ నాన్న ఫౌండేషన్ చైర్మన్ ఎమ్. ఆంజనేయులు, గిర్వాణి విద్యా సంస్థల డైరెక్టర్ బాలానంద్ దేశాయి, రబింద్రా పాఠశాల డైరెక్టర్ పోతన్న యాదవ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఇందులో సుమారు 200లకు పైగా విద్యార్థులు, గణిత నమూనాలు తయారు చేసి ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో పలువురు మాట్లాడుతూ నిత్యజీవితం గణితంతో ముడిపడి ఉందన్నారు. అనంతరం ముఖ్య అతిథులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో రబింద్రా ప్రిన్సిపల్ అసంవార్ సాయినాథ్, పాఠశాల కరస్పాండెంట్ రంజేంధర్, చైర్మెన్ భీంరావ్ దేశాయ్, అక్షర డైరెక్టర్ సుభాష్ పాటిల్, లిటిల్ ఫ్లవర్ ప్రిన్సిపల్ నజీబ్, శిశుమందిర్ ప్రధాన ఆచార్యులు సారథి రాజు పాల్గొన్నారు.



ముధోల్‌లో..

కుభీర్ : మండల కేంద్రంలోపి కస్తూర్బ గాంధీ బాలికల పాఠశాలలో శుక్రవారం గణిత శాస్త్ర పితమహుడు రామానుజన్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు గణిత శాస్త్రంపై వ్యాసరచన పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందించారు. ఎస్ఓ వాణి మాట్లాడుతూ గణిత శాస్త్ర పితమవుడి 1729 జయంతి ఆకృతిలో కూర్చోబెట్టి గణిత శాస్త్రం గురించి వివరించమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయురాళ్లు మంజుల ప్రవీణ, విద్యార్థులు పాల్గొన్నారు

కడెం : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గణిత మేధావి శ్రీనివాస రామానుజన్ జన్మదినాన్ని పురస్కరించుకుని శుక్రవారం జాతీయ గణిత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. రామానుజన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ గణిత శాస్త్ర ప్రాధాన్యాన్ని విద్యార్థులకు వివరించారు. గణిత శాస్త్రానికి రామానుజన్ చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి ప్రధాన ఉపాధ్యాయులు బి వెంకటరమణ, ఉపాధ్యాయులు మహేష్ కుమార్, మురళి, తిరుపతమ్మ, రాజ్యలక్ష్మి, రమేష్ కుమార్, నాగరాజు, రమేష్ బాబు, వినోద్ కుమార్, శివకుమార్, ధర్మయ్య, కృష్ణ పాల్గొన్నారు.



నార్నూర్‌లో..

కొలాం, తోటి, పీవీటీజీల అభివృద్ధికి కృషి చేయాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

కొలాం, తోటి, పీవీటీజీల అభివృద్ధికి అధికారులు సమన్వయంతో కృషి చేయాలని జిల్లా కలెక్టర్ బొర్కాడే హేమంత్ అన్నారు. శుక్రవారం జిల్లా అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, దాసరి వేణు, జిల్లా గిరిజన అభివృద్ధి శాఖ అధికారి రమాదేవితో కలిసి తహసీల్దార్లు, ఎంపీడీఓలు, వివిధ శాఖల అధికారులతో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి జన్ మన్ పథకం నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి జన్ మన్ పథకంలో భాగంగా జిల్లాలోని 149 పీవీటీజీ గ్రామాలలో చేపట్టవలసిన పక్కా గృహాలు, రహదారులు, ఇంటర్నెట్ సేవలు, విద్యుత్, మంచినీటి సరఫరా, అంగన్‌వాడీ కేంద్రాల ఏర్పాటు, సబ్ సెంటర్ల భవనాలు, పాఠశాలల భవనాల నిర్మాణాలు చేపట్టడానికి అవసరమైన నివేదికలు రూపొందించి త్వరగా అందజేయాలని తెలిపారు. కనీసం 50 పీవీటీజీ గ్రామాలలో మల్టీ పర్పస్ కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు జనాభా ఆధారంగా ఎలాంటి వివాదాలు లేని 1000 చదరపు గజాల స్థలాన్ని గుర్తించి నిర్మాణ పనులు చేపట్టాలని తెలిపారు. పీవీటీజీల కొరకు జన్ధన్ బ్యాంకు ఖాతా తెరిచే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని, జనవరి 15, 2024న లబ్ధిదారులతో ప్రధానమంత్రి మాట్లాడే కార్యక్రమం ఉన్నందున అధికారులు సిద్ధంగా ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

తేమ పేరిట కోత విధిస్తే ఖబడ్దార్



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

రైతులు అమ్మకానికి తెచ్చిన పత్తిలో సీసీఐ అధికారులు తేమ పేరిట కోత విధిస్తే ఖబడ్దార్ అని ట్రైనీ కలెక్టర్ వికాస్ అన్నారు. శుక్రవారం ఆయన మండలంలోని మిత్తల్, విజయలక్ష్మి, ఇంద్రవెల్లి ఫార్మర్స్ ప్రొడ్యూసర్ తదితర జిన్నింగ్ మిల్లులను తనిఖీ చేశారు. పత్తి తూకం కాంటాలను పరిశీలించారు. జిన్నింగ్ యజమానులు తూనికలు కొలతల శాఖ అధికారులు ద్వారా కాంటాలను ధృవీకరించాలని సూచించారు. తూకంలో తేమ పేరిట రైతులను మోసగిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రయివేట్ వ్యాపారులకు సహకరించవద్దని పేర్కొన్నారు. జిన్నింగ్ ఆవరణలో రైతులకు తాగు నీరు ఇతర కనీస సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. అమ్మిన పంటకు సకాలంలో చెల్లింపులు చేయాలన్నారు. ఆయన వెంట మార్కెటింగ్ డీఎం శ్రీనివాస్, సెక్రెటరీ రాజేశ్వర్, సిబ్బంది కమలాకర్ ఉన్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అప్పగింత

నవతెలంగాణ-వాంకిడి

పోగొట్టుకున్న మొబైల్ ఫోన్‌ను సీఈఐఆర్ టెక్నాలజీ ద్వారా వాంకిడి పోలీసులు ట్రాప్ చేసి మొబైల్‌ను స్వాధీనం చేసుకొని బాధితుడికి అప్పగించినట్టు ఎస్సై సాగర్ తెలిపారు. మండలంలోని కిర్డీ గ్రామానికి చెందిన చునార్కర్ శ్రీకాంత్ రూ.15 వేల విలువ గల మొబైల్ ఫోన్‌ను ఆరు నెలల క్రితం పోగొట్టుకున్నాడు. అదే రోజు వాంకిడి పోలీస్‌స్టేషన్‌లో తన ఫోన్ పోయిందని ఫిర్యాదు చేశారు. ఫిర్యాదును స్వీకరించిన పోలీసులు విచారణ చేపట్టి పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను శుక్రవారం స్వాధీనం చేసుకొని తిరిగి బాధితుడు శ్రీకాంత్‌కు అప్పగించారు. ఫోన్‌ను వెతికి ఇచ్చినందుకు శ్రీకాంత్ పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు. ఎవరైన ఫోన్‌ను పోగొట్టుకున్నా గుర్తు తెలియని వ్యక్తులు దొంగతనం చేసిన వెంటనే కేంద్ర ప్రభుత్వం నూతనంగా తీసుకొచ్చిన సీఈఐఆర్ యాప్‌లో వివరాలు నమోదుచేసి పోగొట్టుకున్న ఫోన్‌ను నేరుగా బ్లాక్ చేయవచ్చని, పోగొట్టుకున్న ఫోన్‌ను తిరిగి పొందే అవకాశం ఎక్కువగా ఉంటుందని తెలిపారు.

ముందస్తు క్రిస్మస్ వేడుకలు

నవతెలంగాణ-కౌటాల

క్రిస్మస్ పండుగను పురస్కరించుకొని మండలంలోని పలు పాఠశాలల్లో శుక్రవారం ముందస్తు క్రిస్మస్ వేడుకలను నిర్వహించారు. మండలంలోని ప్రయివేటు ప్రభుత్వ పాఠశాలలో క్రిస్మస్ సందర్భంగా బాల యేసు పుట్టిన కథ క్రిస్మస్ తాత వేషాధారణ పశువుల పాక నమూనాలను ఏర్పాటు చేశారు. అనంతరం పిల్లలతో పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. నజరత్ మిషన్ పాఠశాలలో చిన్న పిల్లలతో చేసిన నృత్యాలు పలువురిని అలరించాయి. అనంతరం విద్యార్థులకు క్రిస్మస్ కేకులను అందించారు.

రేపు కిడ్స్ డ్రాయింగ్ కాంపిటీషన్

ఆదిలాబాద్‌టౌన్ : పక్కా ఆదిలాబాద్ - ఆదిలాబాద్ గాట్ టాలెంట్ - సాగర్ సూపర్ మార్కెట్ వారి ఆధ్వర్యంలో కిడ్స్ డ్రాయింగ్ కాంపిటీషన్ పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు అశోక్ తెలిపారు. శుక్రవారం కాంపిటీషన్‌కు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ నెల 23 తేదీ వరకు రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని, 24న ఉదయం 10 గంటలకు ఆదిత్య జూనియర్ కాలేజిలో పోటీలు ఉంటాయని తెలిపారు. ఎలాంటి ఎంట్రీ ఫీజు లేదని ప్రోగ్రాంలో పాల్గొన్న ప్రతిఒక్కరికి సర్టిఫికెట్ ఇస్తామని పేర్కొన్నారు. అలాగే విజేతలకు షీల్డ్స్ ప్రదానం చేస్తామని తెలిపారు. వివరాలకు 9666697317, 8096726334 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

వికాస్ భారత్ సంకల్ప్ యాత్ర

వాంకిడి : మండలంలోని బంబారా, సోనాపూర్ గ్రామాల్లో వికాస్ భారత్ సంకల్ప్ యాత్రలో భాగంగా గ్రామాల్లో వైద్యశిబిరాలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేసినట్టు హెచ్ఈఓ రవిదాస్ తెలిపారు. శుక్రవారం ప్రజలకు ప్రభుత్వ ఆస్పత్రిలో అందుతున్న సేవల గురించి, ముందు జాగ్రత్త చర్యగా కరోనా వ్యాధిపై తగు జాగ్రత్తలు తీసుకోవాలని, తప్పనిసరిగా మాస్కు వాడాలని ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి అనుమానాలు వచ్చిన తక్షణమే వైద్యాధికారులను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో తెలంగాణ గ్రామీణ బ్యాంకు మేనేజర్ విష్ణుతో పాటు వ్యవసాయ శాఖ సిబ్బంది, ఐకేపీ సిబ్బంది పాల్గొన్నారు.

సాదాసీదాగా సర్వసభ్య సమావేశం



నవతెలంగాణ-నార్నూర్

మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం ఎంపీపీ కనక మోతు బాయి అధ్యక్షత నిర్వహించిన సర్వసభ్య సమావేశం సాదాసీదాగా కొనసాగింది. సర్వసభ్య సమావేశానికి ఆయా శాఖల అధికారులు తమ ప్రగతి నివేదికను చదివి వినిపించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ప్రజా సమస్యల పట్ల అధికారులు నిర్లక్ష్యం వహించకుండా త్వరితగతిన పరిష్కరించేందుకు ప్రణాళికా బద్ధంగా పని చేయాలని సూచించారు. చలికాల నేపథ్యంలో గ్రామాల్లో వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని, వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి ప్రజా సమస్యల పరిష్కారం, మండల అభివృద్ధికి పాటుపడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రమేష్, వైస్ ఎంపీపీ చంద్రశేకర్, కో ఆప్షన్ మెంబర్ దస్తగీర్, నాగల్‌కొండ సర్పంచ్ సునీత నారాయణ్, ఎంపీటీసీలు కళావతి ఉత్తం, అబెదా ఖానం, మండల స్థాయి ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఫిర్యాదు దారులతో మర్యాద పూర్వకంగా మెలగాలి



నవతెలంగాణ-కౌటాల

ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా మెలగాలని కాగజ్‌నగర్ డీఎస్పీ కరుణాకర్ అన్నారు. శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌ను ఆయన తనిఖీ చేశారు. పోలీస్‌స్టేషన్ లోని పరిసరాలు ఫిర్యాదుల స్వీకరణ విభాగం, రికార్డులను ఆయన పరిశీలించారు. అనంతరం పోలీసులకు పలు సూచనలు చేశారు. ఎక్కడ ఎలాంటి ఆవంచనియ సంఘటనలు జరగకుండా గ్రామస్థాయి నుంచి ప్రజలను అప్రమత్తం చేయాలని గ్రామాల్లో మత్తుపదార్థాల వినియోగం గంజాయి సాగు నాటుసార తదితరాలపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజలు ఎలాంటి సమస్యలతో వచ్చిన ఫిర్యాదు తీసుకోవాలని వారికి తగిన న్యాయం సకాలంలో జరిగేలా చూడాలని ఆయన తెలిపారు. ఆయన వెంట కౌటాల సర్కిల్ ఇన్స్‌పెక్టర్ సాదిక్ పాషా ఎస్సై మధుకర్ ఉన్నారు.

మూడు రోజులు పత్తి కొనుగోలు బంద్

నవతెలంగాణ-బోథ్

మార్కెట్ యార్డ్ పరిధిలోని బోథ్, పోచ్చర, సోనాల, నేరడిగొండ, జిన్నింగ్‌లలో 24 నుండి 26 వరకు సీసీఐ పత్తి కొనుగోలు ఉండవని మార్కెట్ కార్యదర్శి దేవయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. క్రిస్మస్ పండుగ, బాక్సింగ్ డే ఉన్నందున పత్తి కొనుగోలు మూడు రోజులపాటు నిలిపివేస్తున్నామని తెలిపారు. ఈ విషయాన్ని రైతులు గమనించి సహకరించాలని కోరారు.

ఎంపీలపై సస్పెన్షన్ ఎత్తివేయాలి

- వామపక్షాల ఆధ్వర్యంలో కేంద్ర దిష్టిబొమ్మ దగ్ధం



కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న వామపక్షాల నాయకులు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పార్లమెంట్‌పై స్మోక్ బాంబ్ దాడి చేసిన వారిని శిక్షించాలని ప్రశ్నించిన ప్రతిపక్ష, వామపక్ష ఎంపీలను సస్పెండ్ చేయడం ప్రజాస్వామ్యాన్ని కాలరాయడమేనని వామపక్ష నాయకులు, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్ అన్నారు. శుక్రవారం 141 ఎంపీల సస్పెన్షన్‌ను నిరసిస్తూ వామపక్షాల ఆధ్వర్యంలో ఎన్టీఆర్ చౌరస్తాలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్ మాట్లాడుతూ అత్యున్నతమైన పార్లమెంట్‌పై దాడి చేసిన వారిని, పాస్ ఇచ్చి వారికి లోనికి పంపిన ఎంపీలపై ఎలాంటి చర్యలు లేవన్నారు. దీన్ని ప్రశ్నించిన 141 మంది ఎంపీలను మోదీ ప్రభుత్వం సస్పెండ్ చేయించిందన్నారు. దాడిలో ప్రతిపక్ష ఎంపీ హస్తం ఉంటే ఇప్పటి వరకు ఆయనపై దేశద్రోహం కేసు నమోదు చేసేవారన్నారు. అధికారంలో ఉన్న ఎంపీ కాబట్టే కాపాడాలని చూస్తున్నారని ఆరోపించారు. ఏకపక్షంగా కేంద్రం వ్యవహరిస్తుందని, వెంటనే సస్పెన్షను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఇదిలా ఉంటే అటూ సీపీఐ పార్టీ ఆధ్వర్యంలో సస్పెన్షను నిరసిస్తూ కేంద్ర ప్రభుత్వ దిష్టి బొమ్మను దహనం చేశారు. జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయం సమీపంలోని రోడ్డుపై దిష్టిబొమ్మను దహనం చేసి కేంద్రానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమాల్లో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి సిర్ర దేవేందర్, ప్రజాపంథా జిల్లా నాయకులు జగన్ సింగ్, న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు బి.వెంకట్ నారాయణ, సీపీఎం సీనియర్ నాయకులు లంక రాఘవులు, బండి దత్తాత్రి , జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పూసం సచిన్, జిల్లా నాయకులు బొజ్జ ఆశన్న, ఆర్.మంజుల, సీపీఐ జిల్లా నాయకులు కుంటాల రాములు, భాస్కర్, కృష్ణ స్వామి, రమేష్, ప్రజాపంథా జిల్లా నాయకులు వామన్, సురేష్ పాల్గొన్నారు .

కాంగ్రెస్ ఆధ్వర్యంలో..

ఇటీవల లోక్ సభ, రాజ్యసభలో ఎంపీల సస్పెన్షన్‌ల పరంపరను ఖండిస్తూ కాంగ్రెస్ శ్రేణులు స్థానిక ఎన్టీఆర్ చౌక వద్ద నిరసన చేపట్టారు. సేవ్ ఇండియా అంటూ కేంద్రానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఎంపీల సస్పెన్షన్ అప్రజాస్వామికమని నినదించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్లమెంట్‌లో కేంద్రం ఒక నియంతగా వ్యవహరిస్తోందని, ప్రశ్నించిన ప్రతిపక్షాల గొంతునొక్కే చర్యను బీజేపీ ప్రభుత్వం మానుకోవాలన్నారు. లోక్ సభలో భద్రతా వైఫల్యంపై చర్చకు పట్టు బట్టిన ఎంపీలను సస్పెండ్ చేసి ప్రజాస్వామ్యాన్ని ఖునీ చేసిందని ఆరోపించారు. అటు భద్రతా వైఫల్యానికి ఎంపీల సస్పెన్షన్‌కి బీజేపీ ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో కిసాన్ సెల్ రాష్ట్ర కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు గిమ్మ సంతోష్, మాజీ డీసీసీబీ అధ్యక్షులు ముడుపు దామోదర్ రెడ్డి, పట్టణ అధ్యక్షులు గుడిపెల్లి నగేష్, మాజీ వైస్ చైర్మెన్ కందుల సుకేందర్, రషీద్ ఉల్ హక్, డేరా కృష్ణారెడ్డి, ఎంఎ షకీల్, బూర్ల శంకరయ్య అన్నెల శంకర్, ఓసావార్ సురేష్, ప్రభాకర్, తిరుమల్ రెడ్డి, రాజ్ మొహమ్మద్, రఫీక్, సయ్యద్ సుజాత్ ఉన్నారు.

బలహీన వర్గాలకు చేయూత కేంద్ర పథకాలు



నవతెలంగాణ-తాంసి

బడుగుబలహీన చేతి వృత్తితో పాటు అన్ని వర్గాల వారి కోసం వికాస్ భారత్ కేంద్ర ప్రభుత్వం పథకాలు ఉపయోగ పడతాయని వికాస్ భారత్ కేంద్ర పరిశీలకులు రమిత్ మౌర్య అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో వివిధ శాఖలకు సంబంధించిన అధికారులతో కలిసి వికాస్ భారత్ అమలు చేస్తున్న పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం బడుగు బలహీన చేతి వృత్తితో పాటు వెనుకబడిన వారికోసం అనేక పథకాలను అమలు చేస్తుందన్నారు. వాటి గురించి తెలియక వినియోగించుకోలేకపోతున్నారన్నారు.ఉచిత వైద్యం, రైతులకు సబ్సిడీపై ఎరువులు, చేతి వృత్తి వారికి బ్యాంకు రుణాలు అనేక పథకాలున్నాయన్నారు. ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఓ కిషన్, డీఎస్ఓ కిరణ్, డీఎంహెచ్ఓ డాక్టర్. నరేందర్ రాథోడ్, ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ శ్రీధర్, మండల వైద్యాధికారి రవీందర్, తాంసి బ్యాంకు మేనేజర్ సాయి, మహిళ సమైక్య సంఘాల సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో ఆదిలాబాద్ జట్టు విజేత

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలోని గిరిజన బాలికల ఆదర్శ క్రీడ పాఠశాల మైదానంలో నిర్వహించిన ఖోఖో అండర్-14 రాష్ట్రస్థాయి బాల బాలికలకు పోటీల్లో ప్రథమ బహుమతిని అదిలాబాదు ఉమ్మడి జట్టు కైవసం చేసుకుంది. పోటీల్లో అత్యుత్తమ ప్రతిభను కనబర్చిన క్రీడాకారులను జాతీయస్థాయి అండర్-14 బాల బాలికల జట్లను ఎంపిక చేసినట్లు ఎస్‌జీఎఫ్ సెక్రటరీ సాంబశివరావు, స్పోర్ట్స్ ఆఫీసర్ మీనా రెడ్డి ప్రకటించారు. బాలుర విభాగంలో ఫైనల్‌లో అదిలాబాద్, రంగారెడ్డి ఉమ్మడి జిల్లాలో బాలురు తలపడగా అదిలాబాద్ ఉమ్మడి జిల్లాజట్టు మొదటి బహుమతిని సొంతం చేసుకుంది. ద్వితీయ స్థానంలో రంగా రెడ్డి ఉమ్మడి జట్టు నిలిచింది. తృతీయ స్థానంలో మెదక్ జిల్లా నిలిచింది. బాలికల విభాగంలో ఫైనల్‌లో ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా, మెదక్ ఉమ్మడి జిల్లాతో తలపడగా అదిలాబాద్ ఉమ్మడి జట్టు ఉత్తమ ప్రదర్శనను కనపరిచి ప్రథమ బహుమతి పొందగా మెదక్ ఉమ్మడి జిల్లా రెండవ స్థానాన్ని నిలుపుకుంది. మూడవ స్థానంలో ఖమ్మం నిలిచింది. గెలుపొందిన జట్లకు గిరిజన సంక్షేమ శాఖ ఉపసంచాలకు ఇన్‌ఛార్జి డీవైఎస్ఓ రమాదేవి, ఐటీడీఏ పివిటీజి పీఓ ఆత్రం భాస్కర్, ఏసీఎంఓ ఉద్ధవ్, గిరిజన సంక్షేమ ఉమ్మడి జిల్లా స్పోర్ట్స్ అధికారి పార్థసారథి, క్రీడా పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు ఎన్.కృష్ణారావు, అంజనీపుత్ర రియల్ ఎస్టేట్ మంచిర్యాల చైర్మన్ అండ్ డైరెక్టర్స్ గుర్రాల సురేష్, చీఫ్ జనరల్ మేనేజర్ హరీష్ పాల్గొన్నారు.

